

వేమూరు.. చైతన్యానికి మారుపేరు



- 2009 నుంచి ఎస్సీ రిజర్వుడుగా మార్పు
- బలహీన వర్గాల ఓట్లు కీలకం
- తొలి ఎమ్మెల్యేగా కల్లూరి
- రెండు శాఖలకు యాక్టు తయారీ
- న్యాయవాదులకు కలిసొచ్చిన సెగ్మెంట్
- 15 ఎన్నికల్లో ఐదుగురు న్యాయవాదులదే హవా

బాపట్ల జిల్లాలోని వేమూరు నియోజకవర్గం రాజకీయ చైతన్యానికి ప్రతిరూపంగా నిలుస్తోంది. ఇక్కడ గతంలో పోటీ చేసిన వారంతా గొప్ప విద్యావంతులు. దీంతో నేతల ఖిల్లాగా వేమూరు నియోజకవర్గం ఘనత వహించింది. 1955 లో ఏర్పడిన ఈ సెగ్మెంట్ ద్వారా ఇప్పటికి 15 అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. 2009 నుంచి ఎస్సీ రిజర్వుడుగా మార్పు చెందింది. ఇక్కడ బలహీన వర్గాల ఓట్లు కీలకం కాగా ఈ నియోజకవర్గం నుంచి ఏ పార్టీ గెలుపొందితే ఆ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉంటుందన్న సెంటిమెంట్ ఉంది. 1995లో తొలి ఎమ్మెల్యేగా విజయం సాధించిన కొల్లూరి చంద్రమౌళి రెండు శాఖలకు యాక్టు తయారు చేశారు. ఇప్పటి వరకు ఐదుగురు న్యాయవాదులు పోటీలో విజయం సాధించడంతో పాటు వారికి ఈ సెగ్మెంట్ ఎంతగానో కలిసి రావడం జరిగింది.

నియోజక వర్గంలో ప్రధాన సామాజిక వర్గాల ఓట్లు

బ్రాహ్మణ	1700
వైశ్య	5,500
కమ్మ	23,870
రెడ్డి	8,818
కాపు	32, 254
గౌడ	12,268
యాదవ	6,339
పద్మశాలి	6,000
నాయీ బ్రాహ్మణ	2,567
రజక	5,106
పల్లెకారు	2,116
సగర	2,150
విశ్వబ్రాహ్మణ	687
ముత్తరాజు	348
వాల్మీకిబోయ	333
వడ్డెర	825
కుమ్మర	2,355
ముస్లిం	7,350
మాల	35,628
మాదిగ	31,920
ఎరుకుల	2,791
యానాది	4,139
లంబాడీ	611


యడ్లపాటి వెంకట్రావు


నాదెండ్ల భాస్కరరావు


డాక్టర్ కొడాలి వీరయ్య చౌదరి


ఆలపాటి ధర్మారావు


ఆలపాటి రాజేంద్రప్రసాద్


డాక్టర్ సతీష్ పాల్‌రాజ్


నక్కా ఆనందబాబు


డాక్టర్ మేరుగ నాగార్జున




శరణు రామస్వామి చౌదరి


కల్లూరి చంద్రమౌళి

వేమూరు, మార్చి 27: వేమూరు నియోజకవర్గంలో చరిత్ర కలిగిన అగ్రహార గ్రామాలతో పాటు చోళరాజులకు 400 సంవత్సరాలకు పూర్వపు ఆలయాలున్నాయి. రాజా వెంకటాద్రినాయుడు రాసిచ్చిన ఈనాం భూముల ఆదాయం ద్వారా ఆలయాలు విలసిల్లుతున్నాయి. ఐదు మండలాల్లో రెండు మండలాల పరిధి గ్రామాలు కృష్ణానది పరీవాహక ప్రాంతాల్లో ఉన్నాయి. పలు లంక గ్రామాలు ఉండటమే కాక 80శాతం పైగా ప్రజలు వ్యవసాయ ఆధారిత జీవనం సాగిస్తున్నారు. ఖరీఫ్, రబీ సాగుల ద్వారా అనేక పంటలు పండిస్తారు. కళారంగ ప్రాముఖ్యంతో పాటు రాజకీయ, విద్య, పారిశ్రామిక రంగాల్లో ఎందరో ఉన్నత స్థానాలకు ఎదిగారు. వందలాది మంది విద్యావేత్తలు అమెరికాలో పారిశ్రామికవేత్తలుగా రాణించడమే కాక ఉన్నత స్థాయిల్లో గుర్తింపు పొందారు. క్రీడా, సినీ రంగ ప్రముఖులు పుట్టిన గడ్డ కూడా. ఇక్కడి నుంచి పలు వాణిజ్య పంటలు రాష్ట్రేతర ప్రాంతాలకు ఎగుమతి అవుతుంటాయి.



సంవత్సరం	విజేత	పార్టీ	ఓటమి	పార్టీ	మెజార్టీ
1955	కల్లూరి చంద్రమౌళి	కాంగ్రెస్	గరికపూడి జోసెఫ్	సిపిఐ	17,428
1962	కల్లూరి చంద్రమౌళి	కాంగ్రెస్	యడ్లపాటి వెంకట్రావు	స్వతంత్ర పార్టీ	7,019
1965	శరణు రామస్వామిచౌదరి	కాంగ్రెస్	యడ్లపాటి వెంక్రటావు	స్వతంత్ర పార్టీ	488
1967	యడ్లపాటి వెంకట్రావు	స్వతంత్ర పార్టీ	నన్నపనేని వెంకట్రావు	కాంగ్రెస్	4,797
1972	యడ్లపాటి వెంకట్రావు	స్వతంత్ర పార్టీ	లంకపల్లి రాఘవయ్య	కాంగ్రెస్	1297
1978	యడ్లపాటి వెంకట్రావు	కాంగ్రెస్ ఐ	కొడాలి వీరయ్యచౌదరి	జనతా	506
1983	నాదెండ్ల భాస్కరరావు	స్వతంత్ర అభ్యర్థి	యడ్లపాటి వెంకట్రావు	కాంగ్రెస్	24,645
1985	కొడాలి వీరయ్య చౌదరి	టీడీపీ	పిఎల్‌వి ప్రసాదరావు	కాంగ్రెస్	8,116
1989	ఆలపాటి ధర్మరావు	కాంగ్రెస్	యడ్లపాటి వెంకట్రావు	టీడీపీ	9,827
1994	ఆలపాటి రాజేంద్రప్రసాద్	టీడీపీ	ఆలపాటి ధర్మరావు	కాంగ్రెస్	10,194
1999	ఆలపాటి రాజేంద్రప్రసాద్	టీడీపీ	ఆలపాటి ధర్మరావు	కాంగ్రెస్	18,947
2004	సతీష్‌పాల్‌రాజ్	కాంగ్రెస్	ఆలపాటి రాజేంద్రప్రసాద్	టీడీపీ	8,776
2009	నక్కా ఆనందబాబు	టీడీపీ	మేరుగ నాగార్జున	కాంగ్రెస్	2,230
2014	నక్కా ఆనందబాబు	టీడీపీ	మేరుగ నాగార్జున	వైసీపీ	2,127
2019	మేరుగ నాగార్జున	వైసీపీ	నక్కా ఆనందబాబు	టీడీపీ	9,999

వేమూరు అసెంబ్లీ పూర్వాపరాలు

పొట్టి శ్రీరాములు ఆత్మబలిదానంతో 1953 అక్టోబరు 1న కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. 1955లో అమర్తలూరు నియోజకవర్గం ఏర్పాటు చేశారు. అమర్తలూరు, వేమూరు, చుండూరు, చేబ్రోలు మండలాల్లోని కొన్ని గ్రామాలుండేవి. ఈమని నియోజకవర్గం కూడా ఉండేది. ఆ తరువాత దుగ్గిరాల నియోజకవర్గం ఏర్పడి కొల్లూరు ఆ నియోజకవర్గంలో ఉండటంతో పాటు వేమూరు మండలంలోని కొన్ని గ్రామాలు కూడా దానిలో కలిసి ఉండేవి. తదుపరి మార్పుల్లో వేమూరు, కొల్లూరు మండలాలను వేమూరు సెగ్మెంట్‌లో కలిపారు. 1955 నుంచి ఇప్పటిదాకా 15సార్లు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఐదుసార్లు, కాంగ్రెస్ ఐ అభ్యర్థి ఒకసారి, స్వతంత్ర అభ్యర్థి ఒకసారి, స్వతంత్ర పార్టీ అభ్యర్థులు రెండుసార్లు, టీడీపీ అభ్యర్థులు ఐదుసార్లు, వైసీపీ అభ్యర్థి ఒకసారి విజయం సాధించారు. తొలిసారిగా 1955లో గెలుపొందిన కల్లూరి చంద్రమౌళి చట్టాలపై అవగాహన కలిగి మంత్రిగా కొనసాగుతూ నాటి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చేందుకు స్వతంత్ర ప్రతిపత్తి కోసం శ్రమించారు. ఇంగ్లడ్‌లో అభివృద్ధిని గుర్తించి రాష్ట్రంలో మార్పు కోసం కొన్ని సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. 1947లో మద్రాసు ప్రావిన్స్‌లో ఏపీ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలతో పాటు ఒడిస్సాలోని కొంత భాగం కలిసి ఉండేది. ఆనాడు పెద్దలు చంద్రమౌళి ప్రతిభను గుర్తించి లోకల్ అడ్మినిస్ట్రేషన్ బాధ్యతలు అప్పగించారు. 1933లో ఆయన నా దేశం రాజ్యాంగం, పంచాయితీరాజ్ చట్టాన్ని రాశారన్న విషయం గ్రహించి స్థానిక స్వపరిపాలన మంత్రిగా, సహకార రంగ మంత్రిగా బాధ్యతలు ఇచ్చారు. 1952దాకా మంత్రి పదవుల్లో కొనసాగారు. 1960లో దేవాదాయ, రెవెన్యూశాఖలు అప్పగించారు.

1962లో వేమూరు నియోజకవర్గ ప్రారంభ సభ్యుడిగా, స్వతంత్ర అభ్యర్థి వెంకట్రావుపై పోటీ చేసి గెలుపొందారు. తిరిగి రెండు మంత్రి పదవులు కొనసాగించి రెవెన్యూ, దేవాదాయశాఖ చట్టంలో పెను మార్పులు తెచ్చారు. 1965నుంచి జరిగిన 12 ఎన్నికల్లో వేమూరు స్థానం నుంచి మంత్రులైన వారందరూ న్యాయవాదులు కావడం విశేషం. తెనాలి ప్రాంతంలో ప్రముఖ న్యాయవాదిగా గుర్తింపు పొందిన యడ్లపాటి వెంకట్రావు 1965 మధ్యంతర ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలో దిగి ఓటమి పాలయ్యారు. 1967 ఎన్నికల్లో గెలుపొందారు. 1972 ఎన్నికల్లో మరోసారి కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబడి విజయం సాధించారు. 1978లో కూడా గెలుపొంది మంత్రి పదవిని సాధించారు. 1983 ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా నిలబడ్డ నాదెండ్ల భాస్కరరావుతో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీపడ్డ యడ్లపాటి ఓటమి పాలయ్యారు. గెలుపొందిన భాస్కరరావు ముఖ్యమంత్రి అయి వేమూరు సెగ్మెంట్‌కు గుర్తింపు తెచ్చారు. 1985లో టీడీపీ అభ్యర్థి కొడాలి వీరయ్య గెలుపొందారు. 1989లో సీనియర్ న్యాయవాది ఆలపాటి ధర్మరావు కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగారు. యడ్లపాటిని ఓడించి మంత్రి అయ్యారు. 1994లో ధర్మరావుపై ఆలపాటి రాజేంద్రప్రసాద్ టీడీపీ అభ్యర్థిగా గొప్ప మెజార్టీ సాధించి మంత్రి అయ్యారు. 2004లో కాంగ్రెస్ అభ్యర్థి పాల్‌రాజ్‌పై బరిలో దిగిన రాజేంద్రప్రసాద్ ఓటమి పాలయ్యారు. 2009 ఎన్నికల్లో న్యాయవాది నక్కా ఆనందబాబు టీడీపీ అభ్యర్థిగా కాంగ్రెస్ అభ్యర్థి అయిన మేరుగ నాగార్జునపై గెలుపొందారు. 2014ఎన్నికల్లో ఆనందబాబు వైసీపీ అభ్యర్థిగా నిలబడ్డ నాగార్జునపై మరో సారి విజయం సాధించారు. మంత్రి వర్గ విస్తరణలో క్యాబినెట్ మంత్రిగా ఆనందబాబు పనిచేశారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి నాగార్జునపై పోటీగా నిలిచిన ఆనందబాబు ఓటమి పాలయ్యారు. నాగార్జున క్యాబినెట్ హోదాలో మంత్రి పదవి దక్కించుకున్నారు. ఈ సెగ్మెంట్ న్యాయవాదులకు ఎంతగానో కలిసొచ్చింది అనడంలో అతిశయోక్తి లేదు.

బరిలో అభ్యర్థులు

తాజా ఎన్నికల బరిలో టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా నక్కా ఆనందబాబు పేరును ఖరారు చేశారు. వైసీపీ నుంచి సంతనూతలపాడు వైసీపీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న వరికూటి అశోక్‌బాబుకు వేమూరు స్థానాన్ని ప్రకటించారు. దీంతో వీరిద్దరూ నియోజకవర్గంలో ప్రచారాన్ని కొనసాగించారు. రాష్ట్రీయ దళిత కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బుస్సా నాగరాజు పేరును ప్రకటించారు.

మొత్తం ఓటర్లు 1,95,756
పురుషుల ఓట్లు 94,875
మహిళల ఓట్లు 1,00,872
ఇతరుల ఓట్లు-9

మరమ్మతులపై.. మౌనం


రుద్రవరం సమీపంలోముళ్ల చెట్లతో మూసుకుపోయిన కరకట్ట

- కోతలతో ప్రమాదభరితంగా కరకట్టలు
- ఇసుక టిప్పర్ల రాకపోకలతో భారీ గోతులు
- వరదలప్పుడు హడావుడి.. ఆ తర్వాత నిర్లక్ష్యం
- కరకట్ట భద్రతపై దృష్టి సారించని ఆర్సీ అధికారులు

రేపల్లె, మార్చి 27: కృష్ణానది కరకట్ట పటిష్టతపై వేలాది ఎకరాల్లో పంటలు, వందల గ్రామాలు ఆధారపడి ఉన్నాయి. కరకట్ట ఎక్కడికక్కడ గోతులతో, కోతలతో ప్రమాదభరితంగా మారింది. అయినా అధికారులు కట్ట పటిష్టత గురించికానీ, మరమ్మత్తుల గురించి కానీ ఆలోచించడంలేదు. కష్ణానదికి వరదల సమయంలో మాత్రం హడావుడి చేసి ఆ తర్వాత పట్టించుకోవడంలేదు. దీంతో కరకట్ట సమీప 30 గ్రామాల ప్రజలు, రైతులు ఆందోళనలో ఉన్నారు. తీరప్రాంతంలోని భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలో సుమారు 40కి.మీ మేర ఉన్న కరకట్టపై అధికారుల పర్యవేక్షణ లేదు. దీంతో ఇసుక, మట్టి టిప్పర్లు, ట్రాక్టర్ల రాకపోకలతో కరకట్ట మోకాలు లోతు గుంతలతో నిండిపోయింది. కరకట్ట వెంబడి పెట్రోలింగ్ నిర్వహించాల్సిన ఆర్సీ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. వరదల సమయాల్లో అధికారులు హడావుడిగా వచ్చి నామ మాత్రంగా కోతల వద్ద ఇసుక బస్తాలు వేసి చేతులు దులుపుకుంటున్నారు. ఆ తర్వాత కట్ట భద్రత గురించి కనీస చర్యలు కూడా తీసుకోవడంలేదని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. గతంలో ఓలేరు పల్లెపాలెం సమీపంలో కట్టకు గండి పడి వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతినడంతో పాటు రూ.కోట్లలో నష్టం వాటిల్లింది. గత వర్షాకాలంలో కొన్ని ప్రాంతాల్లో గాడులు పడి కోతలకు గురై కట్ట ప్రమాదభరితంగా మారింది. భట్టిప్రోలు మండలం వెల్లటూరు సమీపంలో కట్ట చిద్రమై మోకాలు లోతు గుంతలు పడి ప్రమాదభరితంగా మారింది. పెదపులివర్రు, ఓలేరు మధ్యలో తారురోడ్డు భారీగా బీటులు వాలింది. రేపల్లె మండలం రావి అనంతవరం, పెనుమూడి, కరకట్ట గుంతలమయంగా మారింది. రుద్రవరం, మైనేనివారిపాలెం, మోర్తోట ప్రాంతాల్లో గత వర్షాలకు కరకట్ట అంతా ఒక వైపు కోతలకు గురై మట్టికొట్టుకుపోయింది. కనగాలవారిపాలెం సమీపంలో మైనేనివారిపాలెం, పిరాట్లంక సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా కరకట్టకు పైప్‌లైన్లు వేసి ఆయిల్ ఇంజన్లను ఏర్పాటు చేశారు. గంగడిపాలెం, రాజుకాల్వ, లక్ష్మీపురం, లంకేవానిదిబ్బ సమీపంలో కరకట్ట కోతలకు గురైంది. లక్ష్మీపురం నుంచి లంకేవానిదిబ్బ వరకు నదిని ఆనుకుని రొయ్యల సాగుతో కరకట్ట బాటగా మారింది. ప్రమాదభరితంగా మారిన కట్టను వేసవిలో పటిష్ట పరుస్తామని పాలకులు, అధికారులు ప్రకటనలు చేస్తున్నారే తప్ప ఆచరణలో అమలు చేయడంలేదు. ఈ వేసవిలో అయినా కట్టకు మరమ్మత్తులు చేసి పటిష్ట పరచాలని ప్రజలు కోరుతున్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) 6.25(గురువారం)
సహారీ (ఉదయం) 4.49 (శుక్రవారం)


పెనుమూడి వారధి సమీపంలో కోతకు గురైన కరకట్ట


కనగాలవారిపాలెం సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా పైపులైన్లు అమర్చిన ఆయిల్ మోటార్లు


చెన్నుపల్లివారిపాలెం సమీపంలో కోసుకుపోయిన కరకట్ట

బాపట్ల ఎస్పీకి డిస్క్‌గోల్డ్ మెడల్

త్వరలో అందజేయనున్న డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి



బాపట్ల, మార్చి 27: శాంతిభద్రతలతోపాటు దిశ, కన్విక్షన్ బెస్ట్ పోలీసింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అందజేసే డిస్క్‌గోల్డ్ మెడల్‌కు ఈ ఏడాది ఎస్పీ వకుల్ జిందాల్ ఎంపికయ్యారు. జిల్లాకు చెందిన మరో 8 మందికి బ్రౌంజ్ డిస్క్ అవార్డులకు ఎంపికయ్యారు. వీరికి అవార్డుతో పాటు పతకాల్ని త్వరలో పోలీసు ప్రధాన కార్యాలయంలో డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి అందజేయనున్నారు. ఈ మేరకు ఎంపికైన వారికి డీజీపీ కార్యాలయం నుంచి సమాచారం అందింది.

తాగునీరు.. వృథా


గడియార స్తంభంసెంటర్ వద్ద రోడ్డు కింద పైపులైన్ పగిలి తాగు నీరు పైకి ప్రవహిస్తున్న దృశ్యం.

- పగులుతున్న పైపులైన్‌లు
- పట్టించుకోని అధికారులు
- ఆందోళన చెందుతున్న పట్టణ ప్రజలు

బాపట్ల, మార్చి 27: తాగునీటి వృధాను బాపట్ల మున్సిపల్ అధికారులు అరికట్టలేకపోతున్నారు. పైపులైన్‌లు పగిలి నీరంతా రోడ్లపైన ప్రవహిస్తున్నప్పటికీ వారికి కనిపించటంలేదు. అసలే వేసవి ఆపైన చెరువులో నీటి నిల్వ తక్కువగా ఉంది. ఇప్పటికే రోజుమార్చి రోజు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఉన్న నీరు ప్రణాళిక ప్రకారం సరఫరా చేస్తేనే వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడగలరు. రోడ్డు విస్తరణ పేరిట సంబంధిత కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా చేపట్టిన పనుల వల్ల పైపులైన్‌లు ధ్వంసం అయ్యాయి. వాటిని మరమ్మత్తులు చేసినా ప్రయోజనం లేదు. కేవలం మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈవిధంగా జరిగిందనే ఆరోపణలు వస్తున్నాయి.

ప్రధాన రహదార్ల కింద పైపులైన్‌ల లీక్‌లు

పట్టణంలోని గడియారస్తంభం సెంటర్‌లో జీబీసీ రోడ్డు కింద పగిలిన పైపులైన్ కు ఇప్పటికే పదిసార్లకు పైగా మరమ్మత్తులు చేశారు. అయినప్పటికీ లీక్‌లు ఏర్పడుతూనే ఉన్నాయి. ఇదేవిధంగా ఉప్పరపాలెం వెళ్ళే రోడ్డులో కూడా పైపులైన్ పగిలి సీసీరోడ్డును చీల్చుకొని నీరు బయటకు వస్తోంది. ఇక జీబీసీ రోడ్డులో అయితే డ్రైనేజీల పక్కన అనేక లీక్‌లు ఏర్పడి నీరు వృధా అవుతోంది. దీనికి శాశ్వత పరిష్కారం చూపకపోతే నీరంతా వృధా అయి వేసవిలో తాగునీటి ఎద్దడి తప్పదు. గడియార స్తంభం సెంటర్‌లో దెబ్బతిన్న పైపులైన్ మరమ్మత్తులను మంగళవారం చేపట్టారు. మెయిన్ పైపులైన్ పక్కనే సరఫరా చేసే పైపులైన్‌లు దెబ్బతినటంతో వాటిని మరమ్మత్తులు చేసే పనిలో మున్సిపల్ సిబ్బంది నిమగ్నమయ్యారు. కాగా ఈ విషయమై మున్సిపల్ కమీషనర్ శ్రీకాంత్‌ను వివరణ కోరగా పైపులైన్‌లు పలుచోట్ల లీక్‌లు ఏర్పడినట్లు గుర్తించామన్నారు. యుద్ధ ప్రాతిపదికన చేపడతామన్నారు.


రోడ్డును తవ్వి పైపులైన్ మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

మొదటి పార్ట్‌కి ఏమాత్రం తగ్గదు

సిద్ధు జొన్నలగడ్డ

సిద్ధు జొన్నలగడ్డ, అనుపమా పరమేశ్వరన్ జంటగా నటించిన చిత్రం 'టిల్లు స్క్వేర్'. మల్లిక్‌రామ్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతోంది. చిత్రబృందం బుధవారం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ "డీజే టిల్లు' యువతను దృష్టిలో పెట్టుకొని తీసిన సినిమా. టిల్లు పాత్రను ప్రేక్షకులు హృదయాల్లో పెట్టుకున్నారు. అందుకే సీక్వెల్ అంటే మొదట భయపడ్డాను. 'టిల్లు స్క్వేర్' కోసం మా టీం అంతా శక్తికి మించి కష్టపడింది. మొదటి



పార్ట్‌కి ఏమాత్రం తగ్గదు. ఈ సినిమాలో థ్రిల్లింగ్, షాకింగ్, సర్‌ప్రైజ్ అంశాలు చాలా ఉన్నాయి. మా నిర్మాత నాగవంశీ, త్రివిక్రమ్, చినబాబు గారికి ధన్యవాదాలు. నేనూ, అనుపమా కలసి ఉన్న పోస్టర్‌ను విడుదల చేసినప్పుడు కొందరు నెగెటివ్ కామెంట్స్ చేశారు. అమ్మాయిని అలా కామెంట్ చేయడం సరికాదు' అన్నారు. మల్లిక్‌రామ్ మాట్లాడుతూ "డీజే టిల్లు' లాగానే 'టిల్లు స్క్వేర్' చిత్రాన్ని కూడా ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం ఉంది. సిద్ధుతో ఈ రెండేళ్ల ప్రయాణాన్ని ఎప్పటికీ మర్చిపోలేను' అని చెప్పారు. డీజే టిల్లూకన్నా ఈ చిత్రం నాలుగురెట్లు వసూళ్లు సాధించాలని దర్శకుడు వెంకీ అట్లూరి ఆకాంక్షించారు. సిద్ధూ ఎనర్జీ లాస్ట్ ఫ్రేమ్ వరకూ ఓ రేంజ్‌లో ఉంటుంది, ఈ సినిమా కూడా సూపర్ హిట్ అవుతుందని దర్శకుడు బొమ్మరిల్లు భాస్కర్ తెలిపారు. సిద్ధూ ఎనర్జీ మైండ్ బ్లోయింగ్, పార్ట్ 2 డబుల్ బొనాంజా అవుతుంది అని దర్శకుడు బాబీ చెప్పారు. చిత్రబృందం సక్సెస్ పార్టీకి సిద్ధంగా ఉండాలని నీరజ కోన కోరారు.

మా అమ్మాయని రికమెండ్ చేయలేదు




మా అమ్మాయి మాళవిక మోహనన్‌ను నేనేమీ రికమెండ్ చేయలేదు. తనకు తానే గుర్తింపు తెచ్చుకుంది. నా ప్రమేయం లేకుండా నటిగా ఆమె నిరూపించుకోవాలి. ప్రస్తుతం తను విక్రమ్‌తో నటిస్తున్న 'తంగలాన్' మూవీ మంచి గుర్తింపు తెస్తుంది" అని ప్రముఖ ఛాయాగ్రాహకుడు, హీరోయిన్ మాళవికా మోహనన్ తండ్రి కె.యు మోహనన్ చెప్పారు. ప్రస్తుతం తను సినిమాటోగ్రాఫర్‌గా వర్క్ చేసిన 'ఫ్యామిలీ స్టార్' సినిమా గురించి మాట్లాడుతూ "ఇది ఒక బ్యూటిఫుల్ మూవీ. ఒక మిడిల్ క్లాస్ వ్యక్తి తన ఫ్యామిలీ కోసం ఏం చేశాడనేది మంచి మెసేజ్‌తో చూపించాం. మంచి లవ్ స్టోరీతో పాటు మనం నిర్లక్ష్యం చేస్తున్న కుటుంబ విలువలను తిరిగి గుర్తు చేసేలా ఉంటుంది" అన్నారు.

పెద్ద విజయాన్ని సాధించాలి



విశ్వ కార్తికేయ, ఆయూషి పటేల్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'కలియుగం పట్టణంలో'. రమాకాంత్ రెడ్డి దర్శకత్వంలో డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, జి.మహేశ్వరరెడ్డి, కాటం రమేశ్‌లు నిర్మించారు. ఈ నెల 29న విడుదలవుతోంది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హీరో సుమన్, నిర్మాత ఏ.ఎం రత్నం అతిథులుగా విచ్చేశారు. సుమన్ మాట్లాడుతూ "ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి" అని కోరుకున్నారు. నిర్మాత ఏ.ఎం.రత్నం మాట్లాడుతూ "టైటిల్ కొత్తగా ఉంది" అని చెప్పారు. డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ "ఈ సినిమా అందరినీ మెప్పిస్తుంది" అని చెప్పారు. "సినిమా ఘన విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది" అని నిర్మాతలు అన్నారు. విశ్వ కార్తికేయ మాట్లాడుతూ "డిఫెరెంట్ కాన్సెప్ట్‌తో వస్తోన్న ఈ చిత్రం మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తుంది" అని చెప్పారు.



రామ్‌చరణ్, కియారా జంటగా నటించిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. శంకర్ దర్శకత్వంలో దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. రామ్‌చరణ్ పుట్టిన రోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి జరగండి జరగండి అంటూ సాగే గీతాన్ని విడుదల చేశారు. అనంత్ శ్రీరామ్ సాహిత్యానికి తమన్ స్వరాలు సమకూర్చారు. దలేర్ మెహందీ, సునిధీ చౌహాన్ ఆలపించారు.

ఒక్కటైన సిద్ధార్థ్, అదితి



హీరో సిద్ధార్థ్, హీరోయిన్ అదితీరావు హైదరీల వివాహం వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్‌లోని రంగనాథ స్వామి ఆలయంలో బుధవారం ఉదయం జరిగింది. తమిళనాడు నుంచి వచ్చిన పురోహితులు వివాహ తంతును జరిపించారు. వివాహ కార్యక్రమం మొదలైనప్పటి నుంచి పూర్తయ్యే వరకు స్థానిక పూజారులను కానీ, ఆలయ సిబ్బంది, స్థానికులను ఎవరినీ లోపలికి అనుమతించలేదు. అనుమతించిన కొద్దిమంది సెల్‌ఫోన్లను కూడా తీసుకున్నారు. వివాహ కార్యక్రమం పూర్తయిన వెంటనే వనపర్తి పట్టణంలోని వాసుదేవమ్మ తోటలో విందు కార్యక్రమం నిర్వహించారు. ఈ తోట వనపర్తి సంస్థానాదీశులది. అదితీరావు హైదరీ వనపర్తి సంస్థానాదీశుల్లో చివరిరాజుగా ఉన్న రామేశ్వర్‌రావు మనమరాలు. ఆయన కూతురు విద్యారావు సంతానం అదితి. వనపర్తి సంస్థానాదీశుల కాలంలో నిర్మించిన శ్రీరంగాపూర్ రంగనాథ స్వామి ఆలయం ఇప్పటికీ సంస్థానాదీశుల ట్రస్టు ఆధీనంలోనే ఉండడంతో పెళ్లితంతును రహస్యంగా నిర్వహించగలిగారని చెప్పవచ్చు. హీరో సిద్ధార్థ్, హీరోయిన్ అదితిరావు హైదరీ కలసి 'మహాసముద్రం' సినిమాలో నటించారు. ఆ సమయంలోనే వీరిమధ్య ప్రేమ చిగురించింది. సిద్ధార్థ్, అదితి ఇద్దరికీ ఇది రెండో వివాహం. సిద్ధార్థ్ తన చిన్ననాటి స్నేహితురాలు మేఘనను 2003లో ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆ తర్వాత 2007లో ఇద్దరి మధ్యలో వచ్చిన విభేదాల కారణంగా విడాకులు తీసుకున్నారు. అదితి 2002లో సత్యదీప్ మిశ్రాను పెళ్లి చేసుకొని, 2012లో విడిపోయారు.

- మహబూబ్‌నగర్ (ఆంధ్రజ్యోతి)



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి పుల్లారావు, కూటమి నాయకులు

జగన్ గ్యాంగ్‌ను తరిమి కొట్టడానికి ప్రజలు సిద్ధం

● బీజేపీ ఆత్మీయ సమావేశంలో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, మార్చి 27: జగన్, అతడి రౌడీ మూకలను తరిమి కొట్టడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. చిలకలూరిపేటలో బుధవారం బీజేపీ నియోజక వర్గ కన్వీనర్ జయరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ప్రత్తిపాటి, జనసేన సమన్వయ కర్త తోట రాజా రమేష్‌లు పాల్గొన్నారు. ప్రత్తిపాటి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం కూటమి విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం మరింత అభివృద్ధి దిశగా ప్రయాణించాలంటూ వైసీపీ సర్కార్‌ను గద్దె దించటమే లక్ష్యంగా మూడు పార్టీ శ్రేణులు పని చేయాలని ప్రత్తిపాటి పిలుపు నిచ్చారు. గత టీడీపీ పాలనలో రూ.4,500 కోట్ల నిధులతో నియోజక వర్గాన్ని అభివృద్ధి చేశామని, అందులో మెజార్టీ వాటానిధులు కేంద్రం నుంచే వచ్చాయని, బైపాస్ రోడ్డు వచ్చినా, అమృత్ పథకం వచ్చినా, టిడ్కో గృహాలు నిర్మించినా, సీసీ రోడ్లు వేసినా, ఎన్ఆర్‌జీఎస్ పనులు చేసినా, కేంద్రీయ విద్యాలయం వచ్చినా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే తీసుకు వచ్చామని, అదే బాటలో కూటమి తిరిగి అధికారంలోకి వస్తే నియోజక వర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం తోట రాజా రమేష్ మాట్లాడుతూ జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి విజయమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని పిలుపు నిచ్చారు.

ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించండి

● టీడీపీ నేతలకు సూచించిన ఆర్వో శ్రీకర్

ప్రత్తిపాడు, మార్చి 27: వలంటీర్ల వద్ద ట్యాబ్‌లు ఉన్నాయి.. ప్రతి కుటుంబానికి సంబంధించి పూర్తి డేటా మొత్తం వారి వద్దనే ఉంది.. నియోజకవర్గంలో సస్పెండైన వలంటీర్లు ఉన్నారు.. పింఛను డబ్బులు కూడా వారి చేత పంపిణీ చేయించ కుండా ఉండాలంటూ తెలుగుదేశం పార్టీ నాయులు పంచుమర్తి శేష ప్రత్తిపాడు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీకర్‌ను కోరారు. ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వలంటీర్ల విషయంలో తెలుగుదేశంపార్టీ నాయకులు కోరడంతో ఈ విషయం తన పరిధిలోనికి కాదని, మీ స్టేట్ లీడర్స్ చేత ఎన్నికల కమిషన్‌కు పిర్యాదు చేయించాలని సూచించారు. అలాగే సీ విజిల్ యాప్‌లో కంప్లైట్ చేసిన వారి వివరాలు బయటకు తెలియజేస్తున్నారంటూ శేష ఆర్వోను ప్రశ్నించారు.

చెక్‌పోస్టులో సీసీ కెమెరాల ఏర్పాటు

● ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్

మాచర్లటౌన్, మార్చి 27: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అంతరాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామని, ప్రతి చెక్‌పోస్టులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్ తెలిపారు. పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చెక్‌పోస్టుల్లో రూ..6 లక్షల విలువైన 1,904 లీటర్ల లిక్కర్ సీజ్ చేశామన్నారు. అలాగే 2.70 లక్షల నగదు, ఇతర వస్తువులు మొత్తంగా రూ.9.54 లక్షలు సీజ్ చేసి కేసులు నమోదు చేశామన్నారు. చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచామన్నారు. గ్రామాల్లో 635 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో రెవెన్యూ, పోలీసు యంత్రాంగాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. రాజకీయ పార్టీల నేతలు సువిధ పోర్టల్ టెక్నికల్ సమస్యలు మా దృష్టికి తీసుకొచ్చారన్నారు. బీఎస్పీ పార్టీ నేతలు తమకు భద్రత కల్పించాలని కోరారన్నారు. రాజకీయ పార్టీలకు అనుకూలంగా పనిచేస్తున్న నలుగురు వలంటీర్లు, ఒక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని విధుల నుంచి తొలగించామన్నారు. నూతనంగా ఓటు కోసం ఫారం-6 ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. ఓటును వేరే నియోజకవర్గాలకు మార్చుకునే అవకాశం ఉందని రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్ తెలిపారు.

పరిశీలన..మమ

● జాయింట్ వెరిఫికేషన్ అంతా జగన్నాటకం
● నది ఒడ్డు నుంచే ఫొటోలు తీసుకొని ముగించిన వైనం
● కొల్లగొట్టింది కోట్లలో.. నామమాత్రంగా అపరాధ రుసుం
● ముడుపుల మత్తులో జోగుతున్న అధికారయంత్రాంగం



కృష్ణానదిలో ఇసుక అక్రమ తవ్వకాలను పరిశీలిస్తున్న అధికారులు

కొల్లూరు, మార్చి 27: ఇసుక అక్రమ తవ్వకాలు ఉమ్మడి పరిశీలన అంతా జగన్నాటకంగా మారింది. ఆయా శాఖల అధికారులు బుధవారం నది ఒడ్డు నుంచే ఫొటోలు తీసుకుని పరిశీలన పూర్తయినట్లుగా మమ అనిపించారు.

పెదలంక పరిధిలోని కృష్ణానదిలో సొసైటీ భూములతో పాటు ప్రభుత్వ భూములు, రైతుల భూముల్లో ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా గత రెండు నెలలకు పైగా సుమారు 15 నుంచి 20 అడుగుల లోతులో దాదాపు 50 ఎకరాలలో ఇసుకను కొల్లగొట్టారు. మైనింగ్ శాఖ ఈ అక్రమ తవ్వకాలు అడ్డుకోకపోగా గుత్తేదారుల నుంచి భారీగా ముడుపులు తీసుకుని భారీ యంత్రాలతో ఇసుక అక్రమ తవ్వకాలను ప్రోత్సహించారు. ఎలక్షన్ కోడ్ రావడం, ఉన్నతాధికారులు ఎన్‌జీటీ ఆదేశాలను ఏ మేరకు అమలు చేశారో నివేదిక ఇవ్వాలని కోరడంతో మైనింగ్ అధికారులు ఇసుక అక్రమ తవ్వకాలను నిలుపుదల చేయించి తమకేమీ తెలియనట్లుగా వ్యవహరిస్తూ జాయింట్ వెరిఫికేషన్ పేరుతో ఇసుక అక్రమ తవ్వకాల పరిశీలనకు తెర తీశారు.

గతంలో రాష్ట్ర ప్రభుత్వం జేపీ వెంచర్స్‌కు ఇసుక తవ్వకాలకు రాష్ట్రవ్యాప్తంగా అనుమతులు జారీ చేసింది. మైనింగ్ అధికారులు గాజుల్లంక వద్ద కృష్ణానదిలో 4.950 హెక్టార్లలో ఇసుక తవ్వకాలు చేసుకునేందుకు అనుమతులు ఇచ్చారు. జేపీ వెంచర్స్ గాజుల్లంక వద్ద కృష్ణానదిలో సుమారు 200 ఎకరాల్లో ఇసుకను తవ్వేయడంతో ప్రస్తుతం అక్కడ ఇసుక రేణువు కూడా లేకుండా పోయింది. తదనంతరం రాష్ట్ర ప్రభుత్వం జీసీకేసీ సంస్థకు ఇసుక తవ్వకాల బాధ్యతలు అప్పగించింది. వారు మరొకరికి ఇసుక తవ్వకునేందుకు సబ్‌లీజ్‌కు ఇచ్చారు. సబ్‌లీజు తీసుకున్న వారు గాజుల్లంక పరిధిలో ఇసుక లేకపోవడంతో పెదల్లంక వద్ద ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో ఉన్న ఇసుక మేటల మీద కన్ను పడింది. దీంతో రైతులకు, సొసైటీ పెద్దలకు నామమాత్రంగా నగదు చెల్లించి ఇసుక తవ్వకాలు చేపట్టారు. గత రెండు నెలల్లో 50 ఎకరాల విస్తీర్ణంలో 15 నుంచి 20 అడుగుల లోతులో ఇసుక తవ్వేసి కోట్లలో సొమ్ము చేసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో ఉమ్మడి పరిశీలనకు వచ్చిన అధికారులు తమకేమీ తెలియదన్నట్లుగా దూరం నుంచే కొన్ని ఫొటోలు తీసుకున్నారు. గాజుల్లంక కృష్ణానది నది, జువ్వలపాలెంలోని కృష్ణానది ఒడ్డుకు చేరుకుని అక్కడ కూడా తమకు కావాల్సిన ఫొటోలను సేకరించి పరిశీలన పూర్తయినట్లుగా వెళ్లిపోయారు. భట్టిప్రోలు మండలం ఓలేరులోనూ గత నెల రోజులుగా ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. వాటిని కూడా మంగళవారం నుంచి నిలుపుదల చేయించిన అధికారులు అక్కడకు కూడా వెళ్లి ఫొటోలు సేకరించి పరిశీలన పూరయినట్లుగా వెళ్లిపోయారు. ఉమ్మడి పరిశీలనలో మైనింగ్ శాఖ జియాలజిస్టు ఫణిరాజ్‌కుమార్, గ్రామీణ నీటి సరఫరా శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ జాన్ ప్రదీప్, భూగర్భ జల వనరుల శాఖ సాంకేతిక నిపుణురాలు వసంతకుమారి, తహసీల్దార్ పుల్లారావు, ఆర్ఐ త్రివేణి, నదీ పరిరక్షణ శాఖ ఏఈ సురేష్‌కుమార్, సబ్ ఎస్ఐ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లగొట్టింది కోట్లలో.. అపరాధ రుసుం లక్షల్లో..

ఇసుక అక్రమ తవ్వకాల ద్వారా గుత్తేదారులు కోట్లు గడిస్తే మైనింగ్ శాఖాధికారులు మాత్రం కొల్లూరు మండలం గాజుల్లంకలో కేవలం రూ.3 లక్షల అపరాధ రుసుం విధించినట్లుగా మైనింగ్ శాఖ ఏడీ రాజేష్‌కుమార్ సోమవారం ఓ దినపత్రికకు ప్రకటన ఇచ్చారు. జాయింట్ వెరిఫికేషన్ కోసం బుధవారం ఆయా శాఖల అధికారులు పరిశీలనకు వస్తే ఏడీ మాత్రం ఎటువంటి కొలతలు లేకుండా ఎంత విస్తీర్ణంలో అక్రమంగా తవ్వేశారో తెలియకుండా, ముందుగానే ఏమీ పరిశీలించకుండానే అపరాధ రుసుం ప్రకటించడం వెనుక మర్మమేమిటో ఆయన చెప్పాల్సి ఉంది. గత రెండు మూడు నెలలుగా గాజుల్లంక పరిధిలో ఇసుక లేకపోవడంతో గుత్తేదారులు పెదల్లంక పరిధిలో అక్రమ తవ్వకాలు సాగిస్తే మైనింగ్ ఏడీ మాత్రం గాజుల్లంక పరిధిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరిగినట్లుగా చెబుతూ నామమాత్రంగా అపరాధ రుసుం విధిస్తే, మళ్లీ కొల్లూరు మండలంలోని పెదలంక, గాజుల్లంక, జువ్వలపాలెం గ్రామాల పరిధిలో ఇసుక రీచ్‌లను బుధవారం ఉమ్మడి పరిశీలన బృందం ఎందుకు వచ్చిందో వారికే తెలియాలి. వారు కూడా ఎక్కడా ఇసుక అక్రమ తవ్వకాలు జరిగాయో తెలియకుండానే, ఎటువంటి కొలతలు వేయకుండానే తూతూ మంత్రంగా పరిశీలన చేసి వెళ్లిపోవడం గమనార్హం. ఫిబ్రవరి 7వ తేదీన గ్రీన్ ట్రిబ్యునల్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 42 ఇసుక రీచ్‌లలో పర్యావరణ పరిరక్షణ నిమిత్తం యంత్రాలతో ఇసుక తవ్వకాలు నిషేధిస్తూ కూలీలతో ఇసుక తవ్వకాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వులు రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికీ ఎక్కడా అమలు చేయకపోవడంతో ప్రస్తుతం ఇసుక అక్రమ తవ్వకాలపై తీసుకున్న చర్యలు గురించి మళ్లీ ఎన్నికల సంఘం ఆధ్వర్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను ఆదేశించడంతో ఓలేరు, పెదలంక పరిధిలో జరుగుతున్న ఇసుక తవ్వకాలను ఎట్టకేలకు మైనింగ్ అధికారులు నిలుపుదల చేయించి తమకేమీ తెలియదన్న చందంగా వ్యవహరిస్తున్నారు.

అందుకే జగన్‌ను ఓడించాలి

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు

నరసరావుపేట టౌన్, మార్చి 27: దాదాపు ఎనభైశాతం శాతం హామీలు ఎగ్గొట్టినందుకు జగన్ పార్టీని ఓడించాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. మద్యనిషేధం హామీపై మాటతప్పి మడమ తిప్పాడని, నాసిరకం మద్యం పోసి 35 లక్షల మంది ఆరోగ్యాల్ని నాశనం చేశారని, లివర్, కిడ్నీలు చెడిపోయి 30 వేల మంది ప్రాణాలు పోయి వారి భార్యల మాంగల్యాలు మంటగలిపి నందుకు జగన్‌పార్టీని ఓడించాలన్నారు. విద్యుత్ చార్జీలు 9 సార్లు పెంచి రూ.64 వేల కోట్లు భారం మోపాడని, నిరంతర కరెంట్ కోతలతో ప్రజలను తీవ్రంగా అల్లాడిస్తున్నాడన్నారు. స్మార్ట్‌మీటర్లు, వ్యవసాయ మోటార్లకు మీటర్ల కొనుగోళ్లలో రూ.15 వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. 2.30 లక్షల ఉద్యోగాల భర్తీపై మాట తప్పాడు, మోగా డీఎస్సీని దగా డీస్సీ చేశాడని, ప్రతి ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ హామీకి మడమ తిప్పాడన్నారు. ప్రాజెక్టులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేస్తానన్న హామీపై మాట తప్పాడని, పోలవరం నిర్వాశితులకు రూ.19లక్షలు ఇస్తానన్న హామీపై మాట తప్పాడని విరుచుకుపడ్డారు. కాంట్రాక్టు ఉద్యోగులందర్నీ క్రమబద్ధీకరి స్తానన్న హామీపై మాట తప్పాడన్నారు. ఇలా 85శాతం హామీలు అమలు చేయకుండా 99శాతం చేశానని అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు.



విలేకరులతో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి

విధుల నుంచి తొలగింపు

● ఆంధ్రజ్యోతికి స్పందన

మాచర్లటౌన్, మార్చి 27: పురపాలక సంఘంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న జి.శ్రీనివాసరావును విధుల నుంచి తొలగిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ వెంకటదాసు తెలిపారు. వాటర్ సప్లయి విభాగంలో ఎలక్ట్రికల్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా వైసీపీ ప్రచారంలో పాల్గొన్నట్లు ఆంధ్రజ్యోతి దినపత్రికలో బుధవారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కమిషనర్ వెంకటదాసు విచారణ జరిపి శ్రీనివాసరావును విధుల నుంచి తొలగించారు.

ఇద్దరు వలంటీర్లను కూడా.. అలాగే ఇరువురు వలంటీర్లు కోట రాజేష్, కందుకూరి మధులను కూడా విధులు నుంచి తొలగించినట్లు కమిషనర్ వెంకటదాసు చెప్పారు. వీరు బ్యాంకుకాలనీ సచివాలయం, కోర్టు బజారు సచివాలయాల్లో వలంటీర్లుగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా వైసీపీకి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నందున ఫ్లయింగ్‌స్క్వాడ్ నివేదిక ఆధారంగా విచారణ జరిపి విధుల నుంచి తొలగించినట్లు చెప్పారు.



పాలకవర్గ సభ్యులకు చెక్కును అందజేస్తున్న భాష్యం హనుమంతురావు

కేజేఎస్ఎస్ సేవలు అభినందనీయం

● భాష్యం విద్యాసంస్థల డైరెక్టర్ హనుమంతరావు
● నూతన భవనసముదాయానికి రూ.50 లక్షల భారీ విరాళం

గుంటూరు(తూర్పు), మార్చి27: పేద బాలికల విద్యను ప్రోత్సహిస్తూ వారికి అండగా నిలిచిన కమ్మజన సేవాసమితి సేవలు అభినందనీయమని భాష్యం విద్యాసంస్థల డైరెక్టర్ భాష్యం హనుమంతరావు అన్నారు. గుంటూరు, జేకేసీ రోడ్డులో నిర్మిస్తున్న కమ్మ బాలికల వసతి గృహానికి భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ రూ.50 లక్షల భారీ విరాళాన్ని ప్రకటించారు. బుధవారం కేజేఎస్ఎస్ పాలకవర్గ సభ్యులకు భాష్యం హనుమంతురావు ఆ చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దాతలకు పేద విద్యార్థినులకు మధ్య వారధిలా కమ్మజన సేవాసమితి పనిచేస్తుందని కొనియాడారు. నూతన భవన సముదాయంలో తామూ భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు. సమితి అధ్యక్షులు సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ భారీవిరాళాన్ని అందజేసిన భాష్యం రామకృష్ణను మన స్ఫూర్తిగా అభినందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేంద్రం, సంయుక్త కార్యదర్శి గుంటుపల్లి కోటేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు ఘంటా పున్నారావు, భాష్యం రామకృష్ణ కుమారుడు భాష్యం సాకేత్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల దొంగలు అరెస్టు

● ఎనిమిది ద్విచక్రవాహనాలు, కారు స్వాధీనం

భట్టిప్రోలు, మార్చి26: వాహనాల దొంగల ముఠా ను అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి 8 బైక్‌లు, 1 ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నట్లు రేపల్లె డీఎస్పీ టీ.మురళీకృష్ణ తెలిపారు. బుధవారం భట్టి ప్రోలు పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ వెల్లడిస్తూ.. పల్నాడుజిల్లా బొల్లాపల్లి మండలానికి చెందిన నలుగురు భట్టిప్రోలు పరిసర గ్రామాల్లో ఇన్నోవా కారులో సంచరిస్తూ మోటార్ సైకిళ్ళను దొంగిలించుకుపోతున్నారు. అలాగే కర్లపాలెం మండలం పెదపులుగువారిపాలెం, భట్టిప్రోలు మండలం ఓలేరు గ్రామాలకు చెందిన ముగ్గురు యువకులు 2 బైక్‌లను దొంగిలించారన్నారు. ఈ దొంగలను అదుపులోకి తీసుకొని వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని కోర్టుకు హాజరుపరచనున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసిన భట్టిప్రోలు ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్, ఇతర సిబ్బందికి రివార్డు నిమిత్తం ఎస్పీకి రిపోర్టు చేయ నున్నట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో వేమూరు సీఐ పి. రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



బీసీ డిక్లరేషన్‌కరపత్రాలు ఆవిష్కరిస్తున్న యరపతినేని శ్రీనివాసరావు

టీడీపీతోనే బీసీలకు న్యాయం

● గురజాల కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, మార్చి27: గతంలో టీడీపీ హయాంలో బీసీలకు గుర్తింపు, గౌరవం, పదవుల కేటాయింపులో న్యాయం జరిగిందని గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో బీసీడిక్లరేషన్ కరపత్రాలను యరపతినేని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో బీసీలపై దాడులు, హత్యలు పెరిగిపోయాయన్నారు. బీసీలకు 34శాతం రిజర్వేషన్లు టీడీపీ తీసుకురాగా వైసీపీ ప్రభుత్వం వచ్చాక 10శాతం రిజర్వేషన్లను తగ్గించటం వలన రాష్ట్రంలో ఎందరో బీసీలు పదవులకు దూరమయ్యారని చెప్పారు. బీసీల కార్పొరేషన్ నిర్వీర్యం చేయటంతో రాష్ట్రంలో ఆర్థిక వెనుకబాటుకు గురయ్యారన్నారు. ముందుగా టీడీపీ జాతీయ క్రమశిక్షణ సంఘ సభ్యుడు గుంటుపల్లి నాగేశ్వరరావు చిత్రపటానికి నివాళర్పించారు. కార్యక్రమంలో తురక వీరాస్వామి, సయ్యద్ అమీర్‌ఆలీ, గండికోట వెంకటేశ్వర్లు, వలేపు రామకృష్ణ, బత్తుల శ్రీను, షేక్ ఖాసిమ్‌సైదా, చింతల అజయ్, నాగరాజు, యర్రగని వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రత్తిపాడు సమన్వయకర్త

బలసానికి షోకాజ్ నోటీస్

ప్రత్తిపాడు వైసీపీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చినట్టు ప్రత్తిపాడు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీకర్ తెలిపారు. ఇటీవల వలంటీర్లతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ నాయకుల నుంచి వచ్చిన ఫిర్యాదులతో పాటు అక్కడ జరిగిన గొడవల నేపథ్యంలో కిరణ్ కుమార్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చినట్టు ఆర్వో తెలిపారు. అక్కడ జరిగిన గొడవకు సంబందించి అందరినీ బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ఎన్నికల నియమావలి ప్రకారం ఏదైనా రాజకీయ పార్టీ నాయకులు ప్రచారాల్లో నింబంధనలు ఉల్లంగిస్తే ఆ ప్రచారానికి సంబందించి పర్మీషన్ తీసుకున్న వారే బాధ్యులవుతారని శ్రీకర్ తెలిపారు.



కోనఫలంలో శంఖారావ ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

వైసీపీని ఓటు ద్వారా తరిమికొట్టాలి

● రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, మార్చి 27: వైసీపీ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేసేందుకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మీఓటు హక్కు ద్వారా తరిమికొట్టాలని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. నిజాంపట్నం మండలం గరువుపాలెం గ్రామంలో కార్యక్రమంలో భాగంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చి ఐదేళ్ళ కాలంలో అవినీతి అరాచకాలే తప్పా ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజలకు పావలా ఇచ్చి జగన్ అండ్ కో దోచుకుతిన్నారన్నారు. సామాన్య ప్రజలపై అధికబారం మోపి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో దించారన్నారు. రాష్ట్రంలో విపరీతంగా యువతను నాశనం చేసే విధంగా గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు చేస్తున్నారన్నారు. ఏటా విడుదల చేసి ఉద్యోగాలు కల్పిస్తామన్న జగన్ ఐదేళ్ళలో ఒక్క జనవరిలో కూడా జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన దాఖలాలు లేవన్నారు. పూజారిపై వైసీపీ నాయకులు దాడి చేసి హేయమైన బూతులు తిట్టటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాతా ఏడుకొండలు, గూడపాటి శ్రీనివాసరావు, దాసరి శ్రీనివాసరావు, కొలసాని రాము, తదితరులు పాల్గొన్నారు.

తరగతులు, పరీక్షలను

5వ సెమిస్టర్‌లోనే నిర్వహించాలి

పెదకాకాని, మార్చి 27: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రెండేళ్లుగా బీఏ, బీకాం, బీబీఏ విద్యార్థులకు 5వ సెమిస్టర్‌లో ఇంటర్నషిప్, ఆరో సెమిస్టర్‌లో పరీక్షలు నిర్వహిస్తున్నారని వారికి ఐదవ సెమిస్టర్‌లోనే తరగతులు పరీక్షలు నిర్వహించాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కోరారు. బుధవారం విశ్వవిద్యాలయానికి వచ్చిన ఆయన వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ లెక్చరర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ జి. నాగరాజు పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



తుళ్లూరులో నినాదాలు చేస్తున్న మహిళలు

వైసీపీ అరాచక పాలన పోవాలి

● 1562 వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, మార్చి 27: అమరావతికి వెలుగు, పూర్వవైభవం కలగాలంటే వైసీపీ అరాచకపాలన పోవాలని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు రాజధాని కొన్ని గ్రామాలలో ఇళ్ల వద్ద నుంచి నిరసన దీక్షలు జరుగుతున్నాయి. బిల్డ్ అమరావతి అంటూ రైతులు, రైతు కూలీలు మహిళలు చేస్తున్న ఆందోళనలు బుధవారం నాటికి 1562 వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మహిళలు మాట్లాడుతూ విజనరీ ఉన్న నాయకుడిని ఎన్నుకుంటే రాష్ట్ర బాగుపడుతుందన్నారు. మూడు రాజధానులతో రాష్ట్రాన్ని సీఎం జగన్‌రెడ్డి సర్వనాశనం చేశాడని ఆరోపించారు. మహిళలని చూడకుండా శాంతియుతంగా ఉద్యమం చేస్తుంటే పోలీసులతో కొట్టించి బూటుకాళ్లతో డొక్కలో తన్నించారన్నారు. న్యాయం చేయమని నిలదీస్తే అక్రమ కేసులు పెట్టి జైల్లో పట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిటీష్ పాలన కన్నా దారుణంగా రాష్ట్ర రాజధానికి భూములిచ్చిన రైతుల పట్ల జగన్‌రెడ్డి వ్యవహరించారన్నారు. బిల్డ్ అమరావతి , జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో మూడు రాజధానులకు వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి.

14న ఫర్టిలైజర్స్, సీడ్ డీలర్స్ అసోసియేషన ఎన్నికలు

గుంటూరు సిటీ, మార్చి 27: ఆంధ్రప్రదేశ్ ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్, సీడ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఏప్రిల్ 14న జరగనున్నాయని రాష్ట్ర అధ్యక్షుడు వజ్రాల వెంకట నాగిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు నగరంలోని అరండల్ పేటలో ఉన్న ఫర్టిలైజర్స్ అండ్ ఇన్సెక్టిసైడ్స్ డీలర్స్ అసోసియేషన్ కల్యాణ మండపంలో ఎన్నికల కార్యక్రమం జరుగుతుందని వెంకట నాగిరెడ్డి తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121, 129,140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00

1,10,908 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,14,185 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,10,908 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 83,570 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8500	20000
నెంబరు. 5	10000	17000
273	9500	21000
341	9000	19500
4884	10000	16000
సూపర్ 10	10000	16000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	21500
బ్యాడిగి	9000	20000
దేవనూరు డీలక్స్	9000	18500
తెల్లకాయలు	5000	12000

ఇంటింటా ప్రచారానికి ముందస్తు అనుమతులు తీసుకోవాలి

● కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల,మార్చి 27 : రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఇంటింటా ప్రచారం చేయాలంటే ముందస్తు అనుమతులు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయపార్టీల నాయకులతో బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో సమావేశమయ్యారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అములులో ఉన్నందున ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు తప్పనిసరిగా అనుసరించాల్సి ఉందని స్పష్టం చేశారు. అభ్యర్థులు తమ ప్రచారానికి సంబంధించిన షెడ్యూల్‌ను రిటర్నింగ్ అధికారికి సమర్పించాల్సి ఉందన్నారు. జిల్లా స్థాయి నాయకులు జిల్లా వ్యాప్తంగా ప్రచారాలు చేయాల్సి ఉంటే జిల్లా ఎన్నికల అధికారి వద్ద దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్రచారానికి సంబంధించిన వాహనాలు, హెలీకాప్టర్ అనుమతులు, ఎయిర్‌బెలూన్స్‌కు జిల్లా ఎన్నికల అధికారి అనుమతిస్తారని వివరించారు. నేరుగా లేదా ఆన్‌లైన్‌లో సువిదాయాప్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. నియోజకవర్గంలో ప్రచారాలు, వాటి అనుతులు కొరకు సంబంధిత ఆర్వోలకు దరఖాస్తు చేసుకోవచ్చు అని తెలిపారు. స్టార్ లీడర్లుగా గుర్తింపు పొందిన ప్రముఖ నాయకుల ప్రచారానికి రాష్ట్ర స్థాయి ఎన్నికల అధికారి వద్ద అనుమతి పొందాలన్నారు. మే నెల 11వ తేదీ వరకు మాత్రమే ప్రచారాలకు అనుమతి ఉంటుందన్నారు. నిబంధనలు సక్రమంగా పాటించటం లేదనే ఫిర్యాదులు అందుతున్నాయని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పార్లమెంట్, శాసనసభ ఎన్నికలు సమీపించిన నేపథ్యంలో ఓటర్ల జాబితాలో సవరణలకు గడువు ముగిసిందని కలెక్టర్ తెలిపారు. ఫారం-7, 8 తొలిగింపులపై దరఖాస్తుల విచారణ ప్రక్రియ ముగిసిందన్నారు. ఇకనుంచి ఫారం-6, ఫారం-8లో షిఫ్టింగ్ ఆఫ్ రెసిడెన్సీ కింద ఏప్రిల్ 15వ తేదీలోగా నమోదైన దరఖాస్తులు మాత్రమే విచారిస్తామన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, సీపీవో శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య, బీజేపీ నాయకుడు కేవీ రామకృష్ణ, కాంగ్రెస్ నాయకుడు దోనేపూడి రవి, వైసీపీ నాయకుడు ఇనగలూరి మాల్యాద్రి, టీడీపీ నాయకుడు షేక్ మహ్మద్‌గౌస్, సీపీఎం సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు అట్ల బాలాజిరెడ్డి పాల్గొన్నారు.



రాజకీయపార్టీల నాయకులతో సమావేశమైన కలెక్టర్ రంజిత్‌బాషా

తక్కువ ఖర్చుతో వరిలో అధిక దిగుబడి సాధించవచ్చు

● బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాసరావు

బాపట్ల,మార్చి 27 : తక్కువ ఖర్చుతో వరిలో అధిక దిగుబడిని సాధించవచ్చు అని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అన్నారు. వ్యవసాయ కళాశాల క్షేత్రంలో రైతు స్థాయిలో నాణ్యమైన వరి విత్తనోత్పత్తి అనే అంశంపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి అసోసియేట్ డీన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వరి సాగులో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ వరి ఉత్పాదకతను సాధించేందుకు రైతులు కృషి చేయాలన్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడిని సాధించే వ్యవసాయ విధానాన్ని అనుసరిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.కృష్ణవేణి మాట్లాడుతూ కృష్ణా డెల్టాలోని మండలాలలో సాగు చేసుకోదగిన అధిక దిగుబడులనిచ్చే వరి వంగడాలు గురించి వివరించారు. సేద్య విభాగాధిపతి డాక్టర్ కె.చంద్రశేఖర్ వరిలో నీటి యాజమాన్యం గురించి వివరించారు. క్షేత్ర ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.ప్రతిభాశ్రీ వరిలో పోషకాల యాజమాన్యం, కలుపు నివారణ పద్ధతులు గురించి తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.సాంబశివరావు, కె.వెంకటేశ్వర్లు, బి.కృష్ణవేణి, జి.కిరణ్మయి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొని వెద వరిలో యాజమాన్య పద్ధతుల కరపత్రాన్ని అవిష్కరించారు.




కరపత్రాన్ని అవిష్కరిస్తున్న అసోసియేట్‌డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు తదితరులు

ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి

● డీఆర్‌డీఏ పీడీ పిచ్చిరెడ్డి

కర్లపాలెం, మార్చి 27 : ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని డీఆర్‌డీఏ పీడీ, స్వీప్ నోడల్ అధికారి వై.పిచ్చిరెడ్డి అన్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో మహిళా సంఘాలకు మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఓటర్ సాధికారిత మీద బుధవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో పిచ్చిరెడ్డి పాల్గొని ఓటు హక్కు గురించి వివరించారు. ఓటు రాజ్యాంగం ఇచ్చిన హక్కు మాత్రమే కాదని, ప్రజాస్వామ్యాన్ని కాపాడే వజ్రాయుధమని, నిర్లక్ష్యం చేస్తే దేశ, రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెట్టినట్లేనని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు మిసైల్ లాంటిదని, బులెట్ కంటే బ్యాలెట్ గొప్పదని ప్రతి ఒక్కరు ఓటుహక్కును నిష్పక్షపాతంగా ప్రలోభాలకు లొంగకుండా ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నేతాజి, ఏపీఎం శ్రీనివాసరెడ్డి, బాపట్ల ఏరియా కోఆర్డినేటర్ యు.సుబ్బారావు, ఎస్సై జనార్ధన్, జోయిబాబు, కార్యదర్శి మోడి శ్రీనివాసరావు, స్వీప్ అధికారులు, షాలెం రాజు, శివకోటేశ్వరరావు, లక్ష్మి పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ పిచ్చిరెడ్డి

ఆంగ్లభాషపై పట్టు అవసరం : ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్

బాపట్ల, మార్చి 27 : విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టు అవసరమని బాపట్ల పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ టి.రాజేంద్రప్రసాద్ అన్నారు. కళాశాలలో రెండు రోజులుగా బెంగళూరుకు చెందిన ఉన్నతి సంస్థ ఆధ్వర్యంలో యు నెక్స్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం ముగింపు కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నైతిక విలువలు, జీవన నైపుణ్యాలు విద్యార్థుల జీవితానికి కీలకమన్నారు. ఛేంజ్‌మేకర్ కె.రామకృష్ణ మాట్లాడుతూ విద్యనభ్యసిస్తున్న మెకానికల్ విద్యార్థులకు జీవన నైపుణ్యాలు, నైతిక విలువలపై అవగాహన అవసరమన్నారు. ప్రతి విద్యార్థి వాడుకభాషతోపాటు ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు కృషి చేయాలని, నైతిక విలువలు కలిగిన వ్యక్తి జీవితంలో అన్నింటిని సాధించగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ హెచ్‌వోడి ఎం.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఈసీ ఆదేశాలు ఖాతరు చేయని వలంటీరు

వేమూరు, మార్చి 27: ఎన్నికల ప్రచారాల్లో వలంటీర్లు పాల్గొనకూడదని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. అలా పాల్గొన్న వారిని సస్పెండ్ చేస్తోంది. అయినా ఖాతరు చేయని వలంటీర్లు వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. బాపట్ల జిల్లా వేమూరు వైసీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు మంగళవారం రాత్రి మండలంలోని చంపాడు గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వలంటీర్ పీక సన్నీడియోల్ పాల్గొన్నాడు.



వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్ పీకా సన్నీడియోల్

సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్

బాపట్ల,మార్చి 27 : ఎన్నికల కోడ్ సందర్భంగా పట్టణ సీఐ యు.శ్రీనివాసులు సాయుధబలగాలలతో బుధవారం బాపట్లలో ప్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమస్యాత్మక ప్రాంతాలు, ప్రధాన కూడళ్లల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్సై అబ్దుల్ రజాక్, ట్రాఫిక్ ఎస్సై సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

పిన్నిబోయనవారిపాలెంలో అధికారుల పర్యటన

● క్షేత్ర స్థాయిలో విచారణ, నీటి శాంపిల్స్ పరీక్ష



తాగునీటి పంపులను పరిశీలిస్తున్న ఆర్డీవో రవీందర్ తదితరులు

బాపట్ల, మార్చి 27 : బాపట్ల మండలం తూర్పు పిన్నిబోయనవారిపాలెం గ్రామంలో అతిసారం సోకి ప్రజలు అల్లాడుతున్నట్లు కలకలం రావటంతో అధికారుల బృందం బుధవారం గ్రామంలో పర్యటించింది. ఆర్డీవో గంధం రవీందర్, ఈవోపీఆర్డీ పులి శరత్‌బాబు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సచివాలయ సిబ్బంది కలిసి గ్రామస్థులను విచారించారు. తాగునీటి అవసరాలకు వినియోగిస్తున్న నీటిని పరీక్షించేందుకు శాంపిల్స్ సేకరించారు. గ్రామస్తుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకొని ప్రమాదం లేదని తెలిపారు. అదేవిధంగా ఐపీఎం డైరెక్టర్ ఎన్.పూర్ణచంద్రరావు ఆదేశాల మేరకు గుంటూరు రీజనల్ లేబరేటరి సివిల్ సర్జన్, బ్యాక్టీరియాలజిస్ట్ డాక్టర్ జి.శోభారాణి ఆధ్వర్యంలో టెక్నికల్ నిపుణులు, సీనియర్ వారట్ అనలిస్ట్ వినుకొండ రాజారావు పర్యవేక్షణలో నీటి నమూనాలు సేకరించారు. వీటిని లేబరేటరికి పంపించారు. అప్పికట్ల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ ఉస్మాన్ సిబ్బందితో కలిసి గ్రామంలో వైద్య శిబిరాన్ని కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ లేబరేటరి సిబ్బంది శివకుమార్, కె.వాణి, టెక్నీషియన్ రామకృష్ణ, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ జి.ప్రభాకరరావు, జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దేవరాజు, ఫుడ్ సెఫ్టీ ఆఫీసర్ ప్రణీత్, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది రత్నశేఖర్, శ్రీనివాస్, ఆషా కార్యకర్తలు మద్దిబోయన కోటమ్మ, నలుకుర్తి సుజాత తదితరులు పాల్గొన్నారు.

అతిసారం అదుపులో ఉంది : డాక్టర్ మల్లేశ్వరి

తూర్పు పిన్నిబోయనవారిపాలెం గ్రామంలో సంభవించిన అతిసార వ్యాధి అదుపులో ఉన్నట్లు కమ్యూనికేబుల్ డిసీజెస్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మల్లేశ్వరి తెలిపారు. బుధవారం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మోహన్ కృష్ణ, సిబ్బందితో కలిసి పిన్నిబోయనవారిపాలెం గ్రామంలో పర్యటించిన ఆమె రోగుల ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం అతిసారం వ్యాపించినవారు లేరని గుర్తించారు. ఇప్పటి వరకు 22 కేసులు రాగా అందులో నలుగురు మినహా మిగిలినవారందరికి తగ్గినట్లు తెలిపారు. నలుగురు వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగులను రీజనల్ డైరెక్టర్ డాక్టర్ శోభారాణి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం నిలకడగా ఉందని, ఎలాంటి ప్రమాదంలేదని గుర్తించారు. ప్రతి ఒక్కరు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియాధికారి రాజ్ కుమార్, సీహెచ్‌వోడి నాగేశ్వరరావు, ఎపిడమిక్ వింగ్ ఇన్‌చార్జి జి.రవికుమార్, ఐడీఎస్‌పీ జిల్లా మేనేజర్ ఎన్.లక్ష్మణ్, జిల్లా ఇమ్యూనైజేషనాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



రోగుల ఇబ్బందులు అడిగి తెలుసుకుంటున్న డాక్టర్ మల్లేశ్వరి తదితరులు

అభివృద్ధి పేరిట వైసీపీ నాయకుల దోపిడీ : సీపీఐ

బాపట్ల, మార్చి 27 : వైసీపీ నాయకులు అభివృద్ధి పేరిట కోట్ల రూపాయలు దోపిడీ చేశారని సీపీఐ జిల్లా నాయకుడు జేబీ శ్రీధర్ ఆరోపించారు. పార్టీశ్రేణులతో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 5 సంవత్సరాలుగా ఎమ్మెల్యే కోన రఘుపతి, వైసీపీ నాయకులు జేబులు నింపుకునేందుకు శ్రమించారన్నారు. వందల కోట్ల పన్నులు వసూళ్ళు చేసి అభివృద్ధి సాకుతో ఉన్న రహదార్లను, డివైడర్లను, డ్రైనేజీలను, నీటిసరఫరా పైపులైన్‌లను పగలగొట్టి నూతన నిర్మాణం చేపట్టి మరలా పగలగొట్టటం చేస్తున్నారన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిర్మాణాలు చేపట్టి కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కాంట్రాక్టర్ ముసుగులో వైసీపీ నాయకుల బినామీలకు జేబులు నింపారని విమర్శించారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

సమయపాలనపాటించి గోరుముద్దను అందజేయాలి

● మండల విద్యాశాఖాధికారి ఉయ్యూరి

పిట్టలవానిపాలెం మార్చి 27 : పిట్టలవానిపాలెం ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలను పిట్టలవానిపాలెం మండల విద్యాశాఖాధికారి-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు బుధవారం తనిఖీ చేసి జగనన్న గోరుముద్దను పరిశీలించారు. పాఠశాలలోని ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎండకాలం దృష్టిలో ఉంచుకొని మధ్యాహ్నం 12.30లోపు భోజనం అందజేయాలన్నారు. ఎండీఎం నిర్వాహకులు విద్యార్థులకు నాణ్యాతాప్రమాణాలతో కూడిన భోజనాన్ని అందజేయాలన్నారు. పాఠశాలలో విద్యార్థులకు విద్యాబోధనలో పాఠ్యాంశాలను సమగ్రంగా అర్థమయ్యే విధంగా బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ప్రకాశరావు, ఉపాధ్యాయులు ఎండీఎం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులు సీట్ల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

● బాపట్ల సమగ్రశిక్ష ఏఎస్‌వో తటవర్తి శ్రీనివాసరావు

పిట్టలవానిపాలెం, మార్చి 27 : పిట్టలవానిపాలెం విద్యాశాఖా కార్యాలయాన్ని బుధవారం బాపట్ల సమగ్ర శిక్ష ఏఎస్‌వో తటవర్తి శ్రీనివాసరావు సందర్శించి సీఆర్పీలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలో పేద విద్యార్థుల సీట్లు కొరకు రిజిస్ట్రేషన్ ఈ నెలాఖరిలోగా పూర్తి చేయాల్సిందిగా సీఆర్పీలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోన తనయుడు నిఖిల్ ప్రచారం

పిట్టలవానిపాలెం, మార్చి 27 : మండలపరిధిలోని కోమలి గ్రామ పంచాయతీలో బుధవారం తన తండ్రి కోన రఘుపతి విజయాన్ని కాంక్షిస్తూ ఆయన తనయుడు కోన నిఖిల్ వైసీపీ మండల, గ్రామ నాయకులతో కలిసి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, మండల ప్రజా పరిషత్ ఇన్‌చార్జి అధ్యక్షుడు దెందుకూరి సీతారామరాజు, మాజీ ఎంపీపీ షేక్ బాజి, రాష్ట్ర రహదార్ల డైరెక్టర్ షేక్ అహ్మద్ హుస్సేన్, కోమలి గ్రామసర్పంచ్ శ్యామలా నాగిరెడ్డి, సంగుపాలెం ఎంపీటీసీ గంగయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు

కర్లపాలెం, మార్చి 27 : కర్లపాలెం మండలంలో 10వ తరగతి పరీక్షలు బుధవారం సోషల్ పరీక్షతో ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజైన సోషల్ పరీక్ష రోజు చింతాయపాలెం పరీక్ష కేంద్రాన్ని ఎగ్జామ్స్ కమిషనర్ రవీంద్రనాథరెడ్డి, డీఈవో నారాయణరావు, తహసీల్దార్ నిర్మలానందబాబా, ఎంఇవో విజయశ్రీ, నిరంజన్, స్క్వాడ్‌మెంబర్స్ జయకుమార్, ప్రభాకర్, వసంత, సంజయ్‌ల బృందం పరీక్షల జరుగుతున్న తీరును పరిశీలించారు. చింతాయపాలెం చీఫ్ సూపరింటెండెంట్ ఆరాధ్యుల కృష్ణంరాజు, డిపార్ట్‌మెంట్ అధికారి ఎం.పుల్లయ్య, సిట్టింగ్ స్క్వాడ్ పివి. ప్రసాద్ పరీక్షలను పర్యవేక్షించారు. మూడు పరీక్షా కేంద్రాలు కలిపి సోషల్ పరీక్షకు 34 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో తెలిపారు.

మద్యం అక్రమ విక్రేత అరెస్టు

బాపట్లరూరల్, మార్చి 27 : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని 12 మద్యం సీసాలు రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన బుధవారం చోటు చేసుకుంది. రూరల్ సీఐ శ్రీహరి తెలిపిన వివరాలు ప్రకారం బాపట్ల మండలం జమ్ములపాలెం గ్రామంలో అచ్చన్న అనే వ్యక్తి అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్నారని సమాచారం రావటంతో దాడి నిర్వహించి అతని వద్ద 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని సీజ్ చేయటం జరిగిందని సీఐ తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమాలను తప్పనిసరిగా పాటించాలని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బాపట్ల,మార్చి 27 : పట్టణంలోని రైలుపేటకు చెందిన కొప్పుల రఘునాథబాబు ఆటో ఎక్కి చీరాల వెళుతుండగా బాలకృష్ణపురం దగ్గర ఎడ్లబండిని ఆటో ఢీకొట్టటంతో అందులో ప్రయాణం చేస్తున్న ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి ఇచ్చిన రిపోర్ట్ మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ యు.శ్రీనివాసులు తెలిపారు. ఆటోడ్రైవర్ ఆటోతో సహా పరారయ్యాడు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి బీఎస్సార్ యాదవ్ మృతి

కర్లపాలెం, మార్చి 27 : బాపట్ల నియోజకవర్గంలో మొట్టమొదటిగా రియల్ ఎస్టేట్ వ్యాపారానికి శ్రీకారం చుట్టిన కర్లపాలెం మండలం బుద్దాం గ్రామానికి బీఎస్సార్ యాదవ్ అనారోగ్యంతో బుధవారం హైదరాబాద్‌లో మృతి చెందారు. బుధవారం రాత్రికి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొస్తారని కుటుంబ సభ్యులు తెలిపారు. బీఎస్సార్ యాదవ్ మృతికి మండలంలోని పలువురు విచారం వ్యక్తం చేశారు.

ఎందుకిలా వరుసగా ఆరోపణలొస్తున్నాయి?

● బల్లికురవ ఎస్ఐని వివరణ కోరిన ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్ల, మార్చి27(ఆంధ్రజ్యోతి): గడచిన పది రోజులుగా బల్లికురవ ఎస్ఐ నాగశివారెడ్డి వ్యవహార శైలిపై ఆరోపణల పరంపర కొనసాగుతూనే ఉంది. మండల పరిధిలోని ఉప్పుమాగులూరు గ్రామస్థులు ఎస్ఐ తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని మంగళవారం ఎస్పీకి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎస్ఐ బుధవారం ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. దాదాపు 20 నిమిషాల పాటు ఎస్ఐను పలు అంశాలపై ఎస్పీ వకుల్‌జిందాల్ వివరణ అడిగినట్లు సమాచారం. ఒకదాని వెంట ఒకటి వరుసగా వస్తున్న ఆరోపణలపై సుదీర్ఘంగా ప్రశ్నించినట్లు తెలుస్తోంది. గతంలో వచ్చిన ఆరోపణలపై బాపట్ల డీఎస్పీ విచారణ చేస్తుండగా, షోకాజ్ నోటీసు కూడా జారీ చేసిన సంగతి తెలిసిందే. ఉప్పుమాగులూరు గ్రామస్థులు చేసిన ఫిర్యాదుపై కూడా విచారణ చేయాలని ఎస్పీ ఆదేశించినట్లు తెలిసింది. ఎస్ఐపై విచారణ రెండు మూడు రోజుల్లో కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఆయన్ను ట్రాఫిక్‌కు బదిలీ చేసినట్లు తెలుస్తుంది.

ప్లాంటేషన్ అంచనాలు వెంటనే తయారు చేయాలి : ఏపీడీ

వేమూరు, మార్చి 27 : ఉపాధి హామీ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్లాంటేషన్ పనులను గుర్తించి వెంటనే అంచనాలను తయారు చేయాలని ఏపీడీ సువార్త ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధి గ్రామాల్లో పని చేసే ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల సమీక్ష నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఏడీపీ మాట్లాడుతూ అమృత సరోవర్, మినీ అమృత సరోవర్ ప్లాంటేషన్ పనులకు సంబంధించిన అంచనాలను తక్షణమే తయారు చేసి కలెక్టర్‌కు పంపాలని ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల వివరాలకు సంబంధించిన నివేదికలను గ్రామాల వారీగా పరిశీలించారు. అన్ని కుటుంబాలకు వంద రోజులు పనిని పూర్తి చేయించాలన్నారు. పంచాయతీ పరిధిలోని లేబర్ బడ్జెట్ నూరుశాతం పూర్తి చేయాలన్నారు. 100రోజుల పని కల్పన కూలీలకు నీడ, వసతి మంచినీటి సౌకర్యం ప్రథమ చికిత్స సౌకర్యం తప్పనిసరిగా కల్పించాలన్నారు. విధి నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం వహించిన, నిధుల దుర్వినియోగానికి పాల్పడిన సహించేది లేదని చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీవో శేషగిరిరావు, ఏపీవో సత్యకృష్ణ, సీవో గౌస్, పీఆర్‌బీఎఫ్‌టీ అవంతి, 17 గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు హాజరయ్యారు.

యువతకు ఉద్యోగావకాశాలు రావాలంటే చంద్రబాబు సీఎం కావాలి

అమృతలూరు, మార్చి 27 : యువతకు ఉద్యోగావకాశాలు రావాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని నక్కా ఆనందబాబు తనయుడు అఖిలేశ్ తెలిపారు. మండల పరిధిలోని పెదపూడిలో బుధవారం తండ్రికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. తన తండ్రి పెదపూడి గ్రా మంలో చేసిన అభివృద్ధి ఎవరూ చేయలేదన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి అయినా నక్కా ఆనందబాబును గెలిపించాలని కోరారు. ఆయన వెంట గొట్టిపాటి గంగాధర్, బోరుగడ్డ ఆనంద్, స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



పెదపూడిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అఖిలేశ్

మార్క్‌ఫెడ్ ద్వారా అపరాలు కొనుగోలు చేయాలి : ఏవో

వేమూరు, మార్చి 27: మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల నుంచి అపరాలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని మండల వ్యవసాయశాఖ అధికారి సునీత తెలిపారు. బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ మినుము, పెసర పండించిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతుల నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా వాటిని కొనుగోలు చేస్తామన్నారు. మినుములు క్వింటాల్‌కు రూ.6950, పెసర రూ.8558 మద్దతు ధర ఇస్తారన్నారు. రైతులు ఆయా గ్రామాల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల సిబ్బందిని కలిసి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కొనుగోలు చేసిన అనంతరం చెల్లించాల్సిన డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారన్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

● 77 మద్యం సీసాలు స్వాధీనం

వేమూరు, మార్చి 27: వేమూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్ర మంగా మద్యం తలిరస్తున్న వ్యక్తిని బుధవారం రాత్రి అరెస్టు చేశారు. వేమూరు నుంచి జంపని గ్రామానికి చెందిన పీకేఎం కుమార్ గుప్తా అనే వ్యక్తి 77 మద్యం సీసాలను తరలిస్తున్నాడని సమాచారం అందుకున్న వేమూరు పోలీసులు కుమార్ గుప్తాను అదుపులోకి తీసుకుని లిక్కర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. సీఐ రామకృష్ణ పర్యవేక్షణలో గుప్తాను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సబ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు.



పోలీసు అధికారులు స్వాధీనం చేసుకున్న లిక్కర్ బాటిల్స్



చినపులివర్రులో ఇంటింటికి తిరిగి బాబు సూపర్‌సిక్స్ కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

● ఆనందబాబును గెలిపించాలంటూ ప్రచారం

కొల్లూరు, మార్చి 27: వేమూరు నియోజకవర్గ టీడీపీ, జనసే న, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నక్కా ఆనందబాబు తరఫున టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు ప్రచారం నిర్వహించారు. మంగళవారం సాయంత్రం మండల పరిధిలోని చినపులివర్రు గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ఉమ్మడి అభ్యర్థి ఆనంద బాబు కు ఓటు వేయాలని కోరుతూ బాబు సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను ఓటర్లకు పంపిణీ చేశారు. ప్రజా సంక్షేమం కోరుతూ చంద్రబాబు సరికొత్త పథకాలను రూపొందించారని, అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని అమలుచేస్తారని తెలిపారు. ప్రచార కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, పార్టీ నాయకులు యలవర్తి కోటేశ్వరరావు, దొప్పలపూడి పసి, మందలపు కమలాకర్, రాజశేఖర్, నాగేశ్వరరావు, ఎన్నారై మణికంఠ, వేములపల్లి మోహనకృష్ణ, సుంకర రాంబాబు, జీఎల్‌జీ భగవాన్, కోగంటి శివవెంకటేశ్వరరావు, దూళిపూడి కృష్ణ, దివి సీతారామయ్య, రావుల రమేష్, దొడ్డపనేని వెంకటేశ్వరరావు, గోరికపూడి ప్రసాద్, మున్నంగి విజయ్, బుర్రి జగన్, శిగిలిశెట్టి రాఘవరావు, తోట సాంబయ్య, పులివర్తి నాంచారయ్య, నర్రా మధు, కొమ్ము తులామాను, తలశిల పండబ్బాయి, కనపర్తి సంగీతరావు, కార్యకర్తలు, అభిమాను లు పాల్గొన్నారు.

చంద్రబాబు సభను విజయవంతం చేయాలి

● టీడీపీ పట్టణ అధ్యక్షుడు గోగినేని పట్టాభి రామారావు

రేపల్లె, మార్చి 27: రాష్ట్రంలో అవినీతి, అరాచక ప్రభుత్వాన్ని తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని టీడీపీ పట్టణ అధ్యక్షుడు గోగినేని పట్టాభి రామారావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం పట్టణంలోని 28 వార్డుల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 31న ఎన్టీఆర్ సర్కిల్ వద్ద చంద్రబాబు సభ ఉందని, ప్రజలంతా ఈ సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో ఎన్నో తప్పుడు వాగ్దానాలు చేసి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి ఐదేళ్ల అవుతున్న జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలంతా తరిమికొట్టేందుకు సిద్ధం కావాలన్నారు. రాష్ట్రాభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వాన్ని గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జీవీ నాగేశ్వరరావు, పంతాని సాయికుమార్, దేవగిరి రంగా, పొన్నూరి గౌరీరామకుమారి, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, గూడవల్లి బాబూరావు, జనసేన నాయకులు రాసంశెట్టి మహేష్, బీజేపీ నాయకులు అన్నం సాంబశివరావు, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోగినేని పట్టాభి రామారావు

ప్రభుత్వ మద్యం దుకాణం అవకతవకలపై విచారణ

చుండూరు మార్చి 27 : మోదుకూరులోని ప్రభుత్వ మద్యం దుకాణంపై స్పందనలో ఫిర్యాదు అందటంతో బుధవారం ఎక్సైజ్ అధికారులు విచారణ నిర్వహించారు. షాపులో ఉద్యోగులు ఇష్టా నుసారంగా వ్యవహరిస్తున్నారని, కొన్ని రకాల బ్రాండ్లు మాత్ర మే అందుబాటులో ఉంచుతున్నారని, వాటినే కొనుగోలు చేయాలని ఒత్తిడి చేయడం, సరైన బిల్లులు కూడా ఇవ్వడం లేదని ఆరోపణలు రావడంతో దీనిపై ఎక్సైజ్ అధికారులు విచారణ నిర్వహించారు. షాపు నిర్వహణ అధికార పార్టీ నాయకుల కను సన్నల్లో ఉండటంతో విచారణ నామమాత్రంగా జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ మద్యం షాపు ద్వారా రోజుకు రూ. 2 లక్షలకు పైగా అమ్మకాలు సాగుతున్నాయని, మోపర్రు, గాయంవారిపాలెం, ఆలపాడు, ఆరమండ, చుండూరు, మోదుకూరు ఆ ఆరు గ్రామాలకు ఇదే షాపు కావడంతో అధికార పార్టీ బ్రోకర్ల హవా కొనసాగుతుంది. తక్కువ రకం బ్రాండ్లు అందుబాటులో ఉంచి మరికొన్ని రకం బ్రాండ్లు గ్రామాల్లో అధిక ధరలకు డోర్ డెలివరీ చేస్తూ లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికార పార్టీ నాయకుల హవా సాగడంతో ఎక్సైజ్ అధికారులు నామ మాత్రపు పరిశీలనతోనే సరిపుచ్చుకుని ఆ నాయకుల ప్రలోభాలకు గురవుతున్నారని స్థానికు లు ఆరోపిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న ఈ సమయంలోనైనా ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేసి లక్షల్లో సాగుతున్న దోపిడీని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్నికల వేళ అప్రమత్తంగా వ్యవహరించాలి

● ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ గోవిందనాయక్

వేమూరు, మార్చి 27 : ఎన్నికలవేళ సెబ్ విభాగం సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని బాపట్ల జిల్లా ఎన్ ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎస్ గోవింద నాయక్ తెలిపారు. బుధవారం రాత్రి ఆయన వేమూరు సబ్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బంది తో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికలవేళ అక్రమంగా మద్యం తరలించడం, మద్యం పంపిణీ వంటి పనులు చేసిన వారిపై చట్టరీత్యా కఠినమైన చర్యలు తీసుకోవలసి ఉందన్నారు. పార్టీలకు అతీతంగా సిబ్బంది విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. సెబ్ నేరాలకు సంబం ధించిన నాటుసారా, బెల్ట్ షాపులు, అక్రమ ఇసుక రవాణా, కల్తీ మమద్యం లాంటి నేరాల గురించి తగిన సమాచారాన్ని ఆయా పరిధిలోని ప్రజలు అధికారులకు తెలియజేసే విధంగా సిబ్బంది కృషి చేయాలన్నారు. గ్రామాల్లో సమాచారాన్ని అందిం చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. సంబంధిత సమాచారాలను సెల్ నెంబర్లు 7881845677, 9908099178లకు తెలపాలన్నారు. వేమూరు స్టేషన్ ఎస్ఐ గంగాధర్ సిబ్బంది పాల్గొన్నారు.



వేమూరు సెబ్ స్టేషన్లో రికార్డులు పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ గోవింద్‌నాయక్

ఎన్నికల నియమావళి అమలు చేయాలి : ఆర్డీవో

రేపల్లె, మార్చి 27: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కేంద్ర ఎన్నికల సం ఘం పొందుపరిచిన ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేసేలా అధికారులు కృషి చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి రేపల్లె ఆర్డీవో హేలా షారాన్ అన్నారు. గురువారం రెవెన్యూ డివిజినల్ కార్యాలయంలో నగరం మండలం చెరుకుపల్లి మండలం పంచాయతీ సెక్రటరీలతో హోమ్ ఓటింగ్ 85ప్లస్ ఓటర్స్ గురించి వివరించారు. మో డల్ కోడ్ ఆఫ్ కాంటక్టుకు సంబంధించిన తగు సూచనలు చేశారు.

ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ సెక్రటరీలు ఎన్నికల నిబంధనలకు లోబడి విధులు నిర్వహించాలని ఎలాంటి సమస్య ఉన్న ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తెలియజేయాలని సూచించారు. పంచాయతీ పరిదిలో నెలకొన్న పోలింగ్ కేంద్రాలను లోటుపాట్లు ఉంటే ముందస్తుగానే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పంచాయతీ పరిధిలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే తమ దృష్టికి తీసుకురావాలని మీకు అప్పగించిన బాధ్యతలు సమగ్రంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో నగరం, చెరుకుపల్లి ఎంపీడీవోలు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన వైసీపీ అద్దంకి మండల ఎస్సీసెల్ కన్వీనర్ పూనూరి నరేంద్రకు కండువా వేసి ఆహ్వానించిన ఎమ్మెల్యే రవికుమార్

టీడీపీలో చేరిన వైసీపీ ఎస్సీసెల్ నాయకులు

అద్దంకిటౌన్, మార్చి 27: నియోజవర్గ పరిధిలోని అన్ని మండలాల్లోని గ్రామాల్లో పర్యటించి ఎస్సీలకు టీడీపీ చేపట్టబోయే అభివృద్ధి పథకాలను తెలియజేస్తు తెలుగుదేశం పార్టీ కూటమి విజయానికి కృషి చేయాలని అద్దంకి శాసన సభ్యులు గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బుధవారం వైసీపీ ఎస్సీ సెల్ అద్దంకి మండల అధ్యక్షుడు పూనూరి నరేంద్ర ముప్పవరంలోని టీడీపీ కార్యాలయంలో గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ సూచన మేరకు వైసీపీకి, పదవి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నానన్నారు. నియోజకవర్గం పరిధిలో అన్ని మండలాల్లో పర్యటించి మాదిగలను సమీకరించి వారిని చైనత్య పరిచి అద్దంకి శాసన సభ్యులు గొట్టిపాటి రవికుమార్ ని మరోమారు శాసనసభ్యులుగా గెలిపించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా నరేంద్రకు ఎమ్మెల్యే రవికుమార్ పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఆయన వెంట పలువురు ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


కొరిశపాడులో ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న పీడీ రాజేష్

అధిక వేతనం పొందే విధంగా పనిచేయండి

మేదరమెట్ల, మార్చి 27: ఉపాధి పనులు చేస్తున్న వారు గరిష్ఠ వేతనం పొందే విధంగా పనులు చేయాలని ఎన్ఆర్ఈజీఎస్ పీడీ ఎస్. రాజేష్ అన్నారు. బుధవారం కొరిశపాడులో ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతాన్ని ఏపీవో కోటేశ్వరితో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండలు పెరుగుతునందున ఉదయాన్నే పనులలోకి వెళ్ళాలన్నారు. వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పనులు జరిగే చోట మంచినీరు అందుబాటులో ఉంచాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. 272 రూపాయల అత్యధిక వేతనాన్ని పొందే విధంగా కూలీలను ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు ఉన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై దృష్టి పెట్టాలి

మార్టూరు, మార్చి 27: ఎన్నికల కోడ్ నిబంధనలను ఉల్లంఘించేవారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో నితిన్ సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నితిన్ మాట్లాడుతూ గ్రామాలలో కోడ్ ఉల్లంఘించే సంఘటనలను తప్పని సరిగా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కోడ్ నిబంధనలను అందరికీ వివరించాలన్నారు. ఎన్నికల నిబంధనలను పాటించ వలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దారు వై. సంధ్య శ్రీ, పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హామీల పేరుతో మళ్లీ జనంలోకి జగన్‌రెడ్డి

ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి
టీడీపీ నేతలంతా ఐక్యంగా కదిలి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి
పలు గ్రామాల నేతలతో సమీక్షలో ఎమ్మెల్యే రవికుమార్


గ్రామాల నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

అద్దంకి. మార్చి 27 : గత ఎన్నికల్లో వైసీపీ ప్రజలకు ఇచ్చిన హామీలను 85 శాతం గాలికి వదిలేసిందని, ఇప్పుడు మళ్లీ ప్రజలను మరో మారు మోసం చేసేందుకు జగన్‌రెడ్డి బస్సు యాత్రతో ప్రజల ముందుకు వస్తున్నారని, ప్రజలు ఆయనను సాగనంపేందుకు సిద్ధంగా ఉండాలని అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ కోరారు. పంగులూరు మండలం ముప్పవరం టీడీపీ కార్యాలయంలో అద్దంకి మండలం చక్రాయపాలెం, గోపాలపురం, సింగరకొండపాలెం, కొత్తరెడ్డిపాలెం, చిన్న కొత్తపల్లి, శ్రీనివాసనగర్, శంఖవరప్పాడు, మైలవరం, వెంపరాల గ్రామాలకు చెందిన టీడీపీ నేతలు కార్యకర్తలతో ఎమ్మెల్యే రవికుమార్ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నేతంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. గత అయిదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను తీవ్రంగా మోసం చేసిందన్నారు. గతంలో కల్లబొల్లి మాటలతో ప్రజలకు అడ్డగోలుగా హామీలను ఇచ్చి వాటిని అమలు పర్చటం చేతకాక అబద్ధపు ప్రచారం చేస్తూ 95 శాతం హామీలను అమలు చేశామని చెప్పటం సిగ్గు చేటన్నారు. దాదాపు 730 హామీలను ఇచ్చి వాటిల్లో 15 శాతం కూడా అమలు చేయలేదని ఆయన ఆరోపించారు. అద్దంకి నియోజకవర్గ వ్యాప్తంగా ఇసుక అడ్డగోలుగా దోచుకుంటున్నారని అయన విమర్శించారు. అద్దంకి మండలం తిమ్మాయపాలెం, మణికేశ్వరం, కొరిశపాడు మండలం అనమనమూరు, తమ్మవరం గ్రామాల పరిధిలో రోజూ వందలాది ట్రాక్టర్ల ఇసుక అక్రమంగా తరలి వెళుతోందని, అధికారులు, పాలకులు వాటి గురించి పట్టించుకోవటం లేదని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో నేతలు మానం దాసు, కరి పరమేష్, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, భైరపునేని సత్యం తదితరులు పాల్గొన్నారు.

నేడు మరికొన్ని గ్రామాల నేతలతో ఎమ్మెల్యే సమీక్ష

మండలంలోని దేసువకొండ, పేరాయపాలెం, మోదేపల్లి, కుంకుబాడు, కొటికలపూడి, తిమ్మాయపాలెం, రామాయపాలెం, వేలమూరిపాడు, కొంగపాడు, మణికేశ్వరం, విప్పర్లవారిపాలెం, నాగులపాడు, జార్లపాలెం, బొమ్మనంపాడు, ఉప్పలపాడు, గోవాడ గ్రామాల టీడీపీ నేతలతో ఎమ్మెల్యే రవికుమార్ ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం వరకు ముప్పవరం టీడీపీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.

అభివృద్ధే మన నినాదం

ఎన్నికల ప్రచారం ప్రారంభించిన టీడీపీ అభ్యర్థి కొండయ్య


దేవినూతలలో ఎన్నికల ప్రచారం చేస్తున్న టీడీపీ అభ్యర్థి ఎం.ఎం కొండయ్య, శ్రేణులు

చీరాల,మార్చి 27 : 'అభివృద్ధే మన నినాదం. చేసేదే చెప్తాం. చెప్పింది చేస్తాం. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలుపు ఖాయం. చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి అవుతారు. అదే లక్ష్యంతో మనం పనిచేద్దాం. ఎన్నికల్లో ఓటుతో ఆశీర్వదించాలని' కూటమి ఉమ్మడి అభ్యర్థి ఎం.ఎం కొండయ్య బుధవారం చీరాల మండలం దేవినూతల నుంచి మిత్రపక్షాలతో కలసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ప్రచారంలో కూటమి బాపట్ల నియోజకవర్గ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి టి. కృష్ణప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మువ్వల వెంకటరమణారావు, జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి గూడూరి శివరామప్రసాద్ తదితరులు ప్రచార ర్యాలీలో అగ్రభాగాన నిలిచారు. ముందుగా గ్రామంలో పలు చోట్ల ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం కొండయ్య తదితరులు మాట్లాడుతూ బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారంటీ, సూపర్‌సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్ తదితరాలను గ్రామస్థులకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో టీడీపీ అభ్యర్థితో పాటు బాపట్ల అభ్యర్థి నరేంద్రవర్మ, బాపట్ల ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్, నేతలు

ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం

వేటపాలెం(చీరాల),మార్చి 27 : స్థానికంగా బుధవారం ఆర్యవైశ్యులు నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సహకరించాలని కోరారు. పలువురు ఆర్యవైశ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి బీసీలు కష్టపడి పనిచేయాలి

ఏలూరిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలి
జయహో బీసీలో రాష్ట్ర అధికార ప్రతినిధి


యద్దనపూడి క్లస్టరులో జరిగిన జయహో బీసీ సమావేశంలో టీడీపీ నేతలు

యద్దనపూడి, (మార్టూరు) మార్చి 27: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీల సంక్షేమం కోసం, బీసీ కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేసిందని రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుంజి వెంకట్రావు అన్నారు. బుధవారం రాత్రి యద్దనపూడి మండలం క్లస్టరు 4 లో జయహో బీసీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు మాట్లాడుతూ బీసీలు అందరూ ఐక్యత తో పని చేయాలన్నారు. తెలుగుదేశం పార్టీ విజయానికి బీసీలు అందరూ కష్టపడి పని చేయాలన్నారు. పర్చూరు నియోజకవర్గంలో టీడీపీ బాపట్ల పార్ల మెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు భారీ మెజారిటీతో మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచి హ్యాట్రిక్ సాధిస్తారన్నారు. ఈ విజయంలో బీసీలు ప్రధాన పాత్ర పోషించాలన్నారు. ప్రతి బీసీ కుటుంబం ఏలూరిని భారీ మెజారిటీతో గెలిపించడం తమ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ గుదే తారక రామారావు, రావిపాటి సీతయ్య, కనపర్తి నాగేశ్వరరావు, శివ రాత్రి శ్రీను, పోలూరి సింగయ్య, అన్నవరపు వాసుబాబు, అద్దంకి రామసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కొండయ్యకు పెరుగుతున్న మద్దతు


కొండయ్యకు మద్దతు తెలుపుతున్న పలు గ్రామాల మత్స్యకార ప్రతినిధులు

వేటపాలెం(చీరాల),మార్చి 27 : టీడీపీ కూటమి అభ్యర్థి ఎం.ఎం కొండయ్యకు మద్దతు తెలిపేవారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. మండల పరిధిలోని రామచంద్రాపురం, పుల్లరిపాలెం గ్రామాలకు చెందిన పలువురు మత్స్యకారులు బుధవారం టీడీపీ కార్యాలయంలో కొండయ్యను కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వస్తుందని, చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి అవుతారని, స్థానికంగా అందరిని కలుపుకుపోతానని, తనను ఆశీర్వదించాలని కోరారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు

- **కాలు విరిగినా వెరవక వీల్‌చైర్‌లోనే హాజరైన విద్యార్థి**


వీల్ చైర్‌లో కేంద్రానికి వస్తున్న విద్యార్థి

ఈపూరుపాలెం(చీరాలటౌన్), మార్చి 27 : పది పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి. దీంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. మండలంలో అధికారులు 11 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈక్రమంలో 1,643 మంది విద్యార్థులకు గాను 40 మంది గైర్హాజరయ్యారు. ఇదిలా ఉంటే చివరి రోజైన సోషల్ పరీక్ష మండల పరిధిలోని తోటవారిపాలెం పంచాయతీ చంద్రమౌళి కాలనీకి చెందిన రంగా ఆకాష్‌కు గండంగా గడిచింది. ఏడాదంతా ఎంతో కష్టపడి చదువుకుని పరీక్షలకు సిద్ధమైన అతనికి మంగళవారం పరీక్ష ముగించుకుని తండ్రి రామ్‌కుమార్‌తో స్కూటర్‌పై ఇంటికి వెళుతుండగా ఈపూరుపాలెం స్టేట్‌బ్యాంకు సమీపంలో సప్లమెంటరీ పరీక్ష ముగించుకుని ఇంటికి మరో స్కూటీపై వెళుతున్న వ్యక్తి వీరిని వేగంగా ఢీ కొట్టాడు. దీంతో ఆకాష్‌కు కాలు విరిగింది. ఈక్రమంలో తండ్రి మంగళవారం రోజే చీరాలలోని ఓ ప్రయివేట్ వైద్యశాలలో చికిత్స అందించారు. అయితే చివరి పరీక్ష ఎలాగైనా పూర్తి చేయాలనే లక్ష్యంతో ఆకాష్ మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు ఐసీయూలోనే ఉండి చదువుకున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు వీల్ చైర్‌పై ఈపూరుపాలెం బాలికోన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రానికి తీసుకురాగా ఆకాష్ ఇబ్బంది పడుతూనే పరీక్ష పూర్తి చేశాడు.

చినగంజాంలో..

చినగంజాం : చినగంజాం, కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 18వ తేదీ నుంచి జరుగుతున్న పదో తరగతి పరీక్షలు బుధవారంతో ముగిశాయి.పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఉత్సహంగా కనిపించారు. పరీక్షా కేంద్రాల నుంచి బయటకు రాగానే స్నేహితులతో కాసేపు సందడిగా గడిపారు. చినగంజాం పరీక్షా కేంద్రంలో జరిగిన సోషల్ పేపరుకు 260 మందికి గాను 17 మంది , కడవకుదురు పరీక్షా కేంద్రంలో 174 మందికి ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్‌లు ఎ.వెంకటసుబ్బారావు, డి.హేమంత్‌కుమార్‌లు తెలిపారు.

కేంద్ర బలగాల కవాతు


యద్దనపూడిలో కవాతు చేస్తున్న కేంద్ర బలాగాలతో పోలీసులు

యద్దనపూడి, (మార్టూరు) మార్చి 27: యద్దనపూడి మండలంలో యద్దనపూడి, గన్నవరం గ్రామాలలో బుధవారం సాయంత్రం మా ర్టూరు స్టేషన్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. యద్దనపూడి ప్రధాన సెంటరులో, గన్నవరం గ్రామంలో మెయిన్ బజారులో పోలీసులతో కవాతు నిర్వహించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా గ్రామాలలో శాంతి యుతమైన వాతావరణం ఉండాలని, ఎలాంటి గొడవలు ఉండకూడదని రాజశేఖర్ రెడ్డి ప్రజలతో మాట్లాడారు. ఎన్నికలు ముగిసేంత వరకు గ్రామాలపై పోలీసుల కన్ను ఉంటుందన్నారు. అసాంఘిక చర్యలను ప్రోత్సహించాలని ప్రయత్నిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రజలు సహకరిస్తే ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతాయన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి గురించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జీవీఎస్ చౌదరి, ఏఎస్ఐ శ్రీనివాసరావు, 30 మందికి పైగా కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

నేడు కోదండరాముడి విగ్రహ ప్రతిష్ఠ


జాగర్లమూడివారిపాలెం గ్రామంలో ప్రతిష్ఠించనున్న విగ్రహాలకు శాస్త్రోక్తంగా పూజలు చేస్తున్న మహిళలు

పంగులూరు, మార్చి 27 : మండలంలోని జేవీపాలెం గ్రామంలో నూతనంగా నిర్మితమైన శ్రీ కోదండ రామచంద్ర స్వామి ఆలయంలో దేవతామూర్తుల ప్రతిష్ఠా కార్యక్రమం గురువారం ఉదయం జరగనుంది. ఉదయం 7 గంటల 40 నిముషాల నుంచి 8 గంటల 20 నిమిషాల మధ్య కాలంలో శ్రీ హనుమత్ సీతాలక్ష్మణసపరివార సహిత శ్రీ కోదండ రామచంద్రస్వామి, జీవధ్వజ, విమాన శిఖర ప్రతిష్ఠా మహోత్సవానికి ఆలయకమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. కార్యక్రమంలో భాగంగా బుధవారం విష్వక్సేనారాధనం, పుణ్యాహం, జలాధివాసం, మహాశాంతిహోమం వంటి కార్యక్రమాలను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలలో పలువురు దంపతులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా నడుచుకోవాలి


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి

వేటపాలెం(చీరాల),మార్చి 27 : ఎన్నికల ప్రక్రియల సజావుగా సాగేలా అధికారులు, సిబ్బంది నడుచుకోవాలని ఆర్డీవో, ఈఆర్వో సూర్యనారాయణరెడ్డి చెప్పారు. వేటపాలెంలో బుధవారం ఆయన అధికారులు, స్బిబందితో కలసి పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు. ప్రాథమికంగా చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిపో అభివృద్ధికి కృషి చేయాలి


కండక్టర్‌లు, డ్రైవర్లకు బహుమతులు అందజేస్తున్న డిపో మేనేజర్ రామ్మోహనరావు

అద్దంకిటౌన్, మార్చి 27: కొటప్పకొండ, శింగరకొండ తిరునాళ్ల సందర్భంగా అత్యధిక ఆదాయం వచ్చిందని, ఇదే స్ఫూర్తితో రాబోయే రోజులలో కూడా డిపో అభివృద్ధికి సిబ్బంది కృషి చేయాలని డిపో మేనేజర్ బి. రామ్మోహనరావు అన్నారు. బుధవారం డిపో ఆవరణంలో కొటప్పకొండ, శింగరకొండ తిరునాళ్ల సందర్భంగా అత్యధిక ఆదాయం తెచ్చిన కండక్టర్లు, డ్రైవర్‌లను డిపో మేనేజర్‌తో పాటు అసిస్టెంట్ మేనేజర్ మహబూబీలు ప్రశంసా పత్రాలను అందజేయడంతో పాటు బహుమతులను అందించి అభినందించారు.

అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరు

ఇంకొల్లు,మార్చి 27: ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అదనపు వార్డుల నిర్మాణానికి రూ. 9.80 లక్షల నిధులు మంజూరైనట్లు డీఎంహెచ్‌వో విజయమ్మ తెలిపారు. ప్రసూతి మహిళల సౌకర్యార్థం ఈ గదుల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఆపరేషన్ థియేటర్‌ను ఆధునీకీకరించనున్నట్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అదనపు వార్డుల నిర్మాణానికి నిధుల మంజూరు చేయడంపై సీహెచ్‌వో కోటేశ్వరరావు, వైద్యాధికారి అంజలీ,ఆరోగ్య సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

నేడు పాండురంగస్వామి ఆలయ తొమ్మిదో వార్షికోత్సవం

మార్టూరు, మార్చి 27: మార్టూరు పడమర బజారులో గురువారం రుక్మాబాయి సమేత పాండురంగ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం 9 వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షులు సకల ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా దేవాలయంలో యజ్ఞాలు, యాగాలు, హోమాలు మధ్యాహ్నం స్వామి వారికి శాంతి కల్యాణం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం అన్న ప్రసాదం ఏర్పాటు చేశామన్నారు. భక్తులు ఈ కార్యక్రమానికి తరలి వచ్చి స్వామి వారి ఆశీస్సులను అందుకోవాలని ఆంజనేయులు ఆ ప్రకటనలో కోరారు.